జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 19 పక్షపత్రిక అక్టోబర్ 1-15, 2012

## గాంధీజీ దృష్టిలో 7 మహా పాపాలు

విలువలు లేని రాజకీయం

శ్రమ లేని సంపద

నీతిలేని వ్యాపారం

శీలసంపద లేని విజ్ఞానం

మానవత్వం లేని శాస్త్రం

ఆత్మసాక్షి లేని ఆనందం

త్యాగనిరతి లేని ఆరాధన



## సురాజ్యంలో కొత్త విలువలు

విలువలు గల రాజకీయం

శ్రమతో కూడిన సంపద

నీతి గల వ్యాపారం

శీలసంపద గల విజ్ఞానం

మానవత్వం గల శాస్త్రం

ఆత్మసాక్షి గల ఆనందం

త్యాగనిరతి గల ఆరాధన

## సురాజ్యం కోసం ఉద్యమిద్దాం
## గాంధీజీ కలలను సాకారం చేద్దాం




ఎల్‌బినగర్‌లో రౌండ్‌టేబుల్



సనత్‌నగర్‌లో రౌండ్‌టేబుల్



నర్సీపట్నంలో రౌండ్‌టేబుల్



అమలాపురంలో సురాజ్య ఉద్యమ ప్రతిజ్ఞ



పత్తికొండలో రౌండ్‌టేబుల్



చిలకలూరిపేటలో సురాజ్య ఉద్యమం



గుంటూరులో రౌండ్‌టేబుల్



కల్వకుంట్లలో సురాజ్య ఉద్యమం

జన రాజకీయం కోసం...
# లోక్‌సత్తా టైమ్స్
పక్షపత్రిక అక్టోబర్ 1-15, 2012
సంపుటి - 3 సంచిక - 19

## లోపలి పేజీల్లో...

సురాజ్య ఉద్యమం.................................. 5
ఎఫ్‌డిఐ అంటే భయమెందుకు..................... 6
డీజిల్, గ్యాస్ సబ్సిడీలు ఎవరు చెల్లించాలి....... 9
కఠిన నిర్ణయాలకు సమయం వచ్చింది............12
కష్టంగా ఆలస్యంగా................................ 15
ఆగ్ ఆగ్ ఆగ్ ఆగ్..................................... 17
సంప్రదాయ రాజకీయం........................... 17
కొలువులకి పనిమంతులు రావట్లేదు.............. 18
కొబ్బరి కార్మికులకు సామాజిక భద్రత.............19
జేపీ తీరే వేరు........................................... 20
పట్టణాలలో సురాజ్య ఉద్యమ నగరా.............. 21

సంపాదకవర్గం
డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు
డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు
సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు
బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# ప్రజా ఉద్యమంగా సురాజ్యం

## సంపాదకీయం

సుపరిపాలనకు సురాజ్య ఉద్యమం రాష్ట్రంలో ప్రారంభమైంది. ఆగస్టు 9న సురాజ్య ఉద్యమ నగార మోగింది. వివిధ పట్టణాలలో దాదాపు 60 రౌండ్ టేబుల్ సమావేశాలు జరిగాయి. పురప్రముఖులు, విద్యాసంస్థలు, పౌరసమాజ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పక్షాల నేతలు సురాజ్య ఉద్యమంలో భాగస్వాములవుతున్నారు. సురాజ్య ఉద్యమ కమిటీలలో సభ్యులుగా చేరి నాయకత్వం అందించడానికి ముందుకు వస్తున్నారు. మన కోసం - మన దేశం కోసం సురాజ్య ఉద్యమం తక్షణ అవసరంగా ఎలుగెత్తి చాటుతున్నారు. ఇంత మందిని ఆకర్షించడం ఈ ఉద్యమం సాధించిన తొలివిజయం. నిస్సందేహంగా సురాజ్య ఉద్యమానికి బలమైన తొలి అడుగుపడింది.

ఒక ఉద్యమం విజయవంతం కావాలంటే దానికి నిర్దిష్టమైన లక్ష్యాలు వుండాలి. అవి జనజీవనాన్ని ప్రభావితం చేసేవిగా వుండాలి. సురాజ్య ఉద్యమానికి అలాంటి స్పష్టమైన లక్ష్యాలు వున్నాయి. అందరికీ ఎదిగే అవకాశాలు కల్పించడం ద్వారా మానవాభివృద్ధినీ స్వతంత్ర జీవనాన్ని సుసాధ్యం చెయ్యాలన్నదే సురాజ్యం ప్రధాన లక్ష్యం. దీనితో పాటు మెరుగైన జీవనానికి మన ఊళ్లో మంచి వసతులు పొందడానికి స్థానిక ప్రభుత్వాల సాధికారత, ప్రజల సొమ్ము వారి అవసరాల కోసం వారి కళ్లముందు ఖర్చుచేసే పద్ధతికోసం వెరసి ఇంటిముందు ప్రభుత్వం కంటి ముందు పాలన సాధించడం మరో లక్ష్యం.

ప్రభుత్వ సేవలను ప్రజలు హక్కుగా పొందడానికి సిటిజన్స్ ఛార్టర్లకు చట్టబద్ధతనిచ్చే పౌరసేవల హక్కు చట్టాన్ని సాధించడం, అవినీతి భరతం పట్టే కొత్త లోకాయుక్త చట్టం సాధించడం సురాజ్య లక్ష్యాలు. మంచి పాలనకు మంచి ఎన్నికల వ్యవస్థ వుండాలని, దామాషా పద్ధతి ఎన్నికల వ్యవస్థ కోసం కృషి చెయ్యడం మరో లక్ష్యం.

ఇందులో ఎన్నికల వ్యవస్థ దేశంలో సాధించాల్సిన సమస్య. మిగిలినవన్నీ ఈ రాష్ట్రంలో సాధించగలిగినవి. చాలా రాష్ట్రాలు ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి.

సురాజ్య ఉద్యమానికి నిర్దిష్ట లక్ష్యాలు ఉన్నాయి. నాయకత్వం అందించగల సురాజ్య కమిటీలు వున్నాయి. ఇప్పుడు కావలసింది విస్తృతంగా ప్రచారం చెయ్యగల సుశిక్షుతులైన వలంటీర్లు, సారధులు. వీరి ద్వారానే ఈ లక్ష్యాలను ప్రజల దగ్గరకు తీసుకుపోవాలి. జనజీవనాన్ని మార్చే ప్రజా ఉద్యమంగా దీనిని నిర్వహించాలి.

సురాజ్య ఉద్యమ లక్ష్యాల చుట్టూ స్థానిక కార్యక్రమాలను రూపొందించు కోవాలి. ప్రజాచైతన్యాన్ని నిరంతరం పెంచే విధంగా ప్రజల భాగస్వామ్యంతో సురాజ్య ఉద్యమం సాగించాలి. ■




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

**ఫోన్ నంబర్లు :**
**040- 23311817, 23311819, 23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తాటైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# సురాజ్య ఉద్యమం

## రాష్ట్ర సారధ్యసంఘం సమావేశం

సెప్టెంబర్ 22
2012

## భవిష్యత్ కార్యక్రమాలు

సురాజ్య ఉద్యమ రాష్ట్ర సారధ్యసంఘ సమావేశం సెప్టెంబర్ 22, 2012 హైదరాబాద్‌లో జరిగింది. సురాజ్య ఉద్యమం ఇప్పటికే రాష్ట్రంలో వివిధ పట్టణాలలో 50 రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించి పట్టణ కమిటీలు ఏర్పడ్డాయి. ఈ రౌండ్‌టేబుల్స్ విశాల ప్రాతిపదికన జరిగాయి. ఉద్యమ స్ఫూర్తితో కృషి చేసిన వారికి, పాలుపంచు కున్న వారందరికి కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాం. సురాజ్య ఉద్యమాన్ని కొనసాగించ డానికి సారధ్య సంఘం రూపొందించిన కార్యక్రమాలను ఎక్కడికక్కడ నిర్వహించు కోవాల్సినదిగా కోరుతున్నాం.



### భవిష్యత్ కార్యక్రమాలు

### I. అక్టోబరు 2 వరకు... పట్టణస్థాయిలో

**అక్టోబరు 1 :** అన్ని విద్యాసంస్థలలో ఎక్కడికక్కడ విద్యార్థులతో సురాజ్య ప్రతిజ్ఞ – జాతీయ గీతాలాపన

**అక్టోబరు 2 :** పట్టణ సురాజ్య కమిటీల ఆధ్వర్యంలో సామూహిక సత్యాగ్రహం (నిరాహార దీక్ష కాదు) ఉదయం 10 గం॥ నుండి మూడు, నాలుగు గంటలపాటు వివిధ సంస్థలు, విద్యార్థులు, పురప్రముఖులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సురాజ్య ఉద్యమం అందరిదీ అన్న రీతిలో అందరితో సందేశాలు ఇప్పించేవిధంగా నిర్వహించాలి.

### రాష్ట్ర స్థాయిలో

- సురాజ్య ఉద్యమ రౌండ్‌టేబుల్స్‌ను ఇతర పట్టణాలకు విస్తరింపజెయ్యడం.
- అక్టోబరు 1, 2 తేదీల కార్యక్రమాలకు పత్రికల ద్వారా, ఛానళ్లద్వారా ప్రచారం.
- సురాజ్య ఉద్యమ లక్ష్యాలు వివరించగల పట్టణస్థాయి రిసోర్స్ బృందాలను గుర్తించడం.

### II. అక్టోబరు 5 నుండి 31 వరకు పట్టణస్థాయిలో....

1. కొత్తపట్టణాలలో రౌండ్‌టేబుల్ సమావేశాల కొనసాగింపు.
2. అన్ని చోట్ల పట్టణస్థాయి సురాజ్య కమిటీల ఏర్పాటు.
3. అన్ని విద్యాసంస్థలు, స్వచ్ఛందసంస్థల ఆధ్వర్యంలో సభలు–సమావేశాలు, చర్చాగోష్ఠులు.
4. వలంటీర్ల నమోదు – ఒకరోజు స్థానిక శిక్షణ.
5. స్థానిక కార్యకలాపాల కోసం సురాజ్య ఉద్యమ నిధి.

### రాష్ట్రస్థాయిలో

- అక్టోబరు 21 – పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీలతో రాష్ట్రస్థాయి సదస్సు.
- సురాజ్య ఉద్యమ డిమాండ్ల ప్రకటన.
- నవంబరు – డిసెంబరు 9 వరకు కార్యకలాపాల ప్రకటన.
- కోటి మందికి సురాజ్య ఉద్యమ ప్రచార కార్యక్రమ వివరాల ప్రకటన.
- పత్రికలు, ఛానళ్లలో ప్రచారం.
- పట్టణస్థాయి రిసోర్స్ బృందాలకు వర్క్‌షాపులు. ■

# ఎఫ్‌డిఐ అంటే భయం ఎందుకు?

- డా॥ జయప్రకాష్‌నారాయణ్

చిల్లర వ్యాపారంలో పరిమితులకు లోబడి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులను అనుమతించాలని సెప్టెంబర్ 14న కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ చర్చలో రెండు వైపులా అనవసరమైన భావోద్వేగాలు, మితిమీరిన ప్రచారం వ్యక్తం అవుతున్నాయి. ఈ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులను అనుమతించడం వల్ల భారీ స్థాయిలో ఉన్న, వైవిధ్యభరితమైన మన ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలు మారిపోతాయన్న వాదనలు సమర్ధనీయంగా లేవు. ఈ పెట్టుబడులు సర్వ వినాశనానికి దారితీస్తాయన్న విమర్శలు కూడా నిలబడేవి కావు.



సమతుల్యతతో కచ్చితమైన నిర్ధారణకు రావడానికి మనం ఆవేశాలకు తావివ్వకుండా మూడు కీలకాంశాలను పరిశీలించాలి. అవి:- ప్రత్యక్ష ప్రయోజనాలు, ముప్పుద పెట్టుబడి, అభివృద్ధిపై పడే ప్రభావం; కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం.

ముందు ప్రత్యక్ష ప్రభావం ఏమిటో చూద్దాం. దీనివల్ల కచ్చితంగా ఒనగూడే ప్రయోజనాలతో పాటు ముప్పు ఉంది. భారత వ్యవసాయరంగం దీర్ఘకాలిక సంక్షోభంలో కూరుకుపోయి ఉంది. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఇప్పుడు ఆ వాటా 15 శాతం ఉంది. కానీ వ్యవసాయంపై ఆధారపడే జనాభా సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ప్రస్తుతం వ్యవసాయం మీద ఆధారపడే వారు 50శాతం మంది ఉన్నారు. దేశ జనాభాలోని 50 శాతం మంది తలసరి ఆదాయం మిగతా జనాభా తలసరి ఆదాయంలో 18శాతం మాత్రమే ఉంది. ఈ వ్యవహారాన్ని యుద్ధ ప్రాతిపదిక మీద చక్కదిద్దాల్సి ఉంది. ఈ దిశగా అనేక ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అందులో ప్రధానమైంది గ్రామీణుల ఆదాయం పెంచడానికి ఉద్దేశించిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకం. కానీ గ్రామీణ సంపద



సృష్టించడానికి, అదనపు విలువ సమకుర్చడానికి ప్రత్యామ్నాయం లేదు.

ప్రస్తుతం రైతుకు, వినియోగదారుడికి మధ్య అత్యంత అసమర్థమైన, సుదీర్ఘమైన మార్కెట్ వ్యవస్థ ఉంది. ఈ కారణంగా అనేక వ్యవసాయ ఉత్పత్తులకు రైతుకు దక్కేది వినియోగదారుడు చెల్లించే ధరలో కేవలం 35 శాతం మాత్రమేనని అనేక అధ్యాయనాల్లో తేలింది. ఎక్కువ కాలం నిలవ ఉండని ఉత్పత్తుల విషయంలో అయితే రైతులకు దక్కుతున్నది 12 నుంచి 20 శాతం మాత్రమే. రవాణాసదుపాయాలు, ఉత్పత్తులను నిలవ చేసే అవకాశాలు, మౌలిక సదుపాయాలు కొరత కారణంగా ధరలో విపరీతమైన ఎగుడు దిగుళ్ల ఉంటున్నాయి. దాదాపు 200 మిలియన్ మెట్రిక్ టన్నుల పళ్లు, కూరగాయాలు ఉత్పత్తి అవుతూ ఉంటే 23.6 మిలియన్ మెట్రిక్ టన్నులను మాత్రమే నిలవ చేసే సామర్థ్యం ఉన్న శీతల గిడ్డంగులు అందుబాటులో ఉన్నాయి. దీనిలోనూ 80శాతం బంగాళ దుంపలను నిలవ చేయడానికే వినియోగిస్తున్నాం. నిలవ ఉండే ధాన్యం వంటి వాటిలో కూడా నిలవ చేయడానికి సరైన సదుపాయం లేనందు వల్ల 10 శాతం వృధా అవుతున్నాయి. త్వరగా పాడైపోయే ఉత్పత్తుల ధరల్లో మరింత ఎగుడు దిగుళ్ల ఉన్నాయి. ఉదాహరణకు కిలో టొమాటోల ధర ఒకప్పుడు అర్థ రూపాయి ఉంటే మరోసారి 30 రూపాయల దాకా ఉంటుంది. నిలవ ఉండే పసుపు వంటి వాటి ధరకూడా క్వింటాలుకు రూ॥1600 నుంచి రూ॥4000 దాకా మారిపోతూ ఉంటుంది. వినియోగదారుడు ఎక్కువ ధర చెల్లిస్తుంటే రైతుకు తక్కువ ధరే దక్కుతోంది.

మనం మూడు చర్యలు విధిగా తీసుకోవాల్సి ఉంది. రైతు నుంచి వినియోగదారుడికి మధ్య మార్కెట్ దూరం బాగా తగ్గాలి. నాణ్యత ఆధారంగా సరుకును వర్గీకరించడం, రవాణా, నిలవ సదుపాయాలను ఆధునీకరించాలి. త్వరగా పాడైపోయే ఉత్పత్తులను మూల్యవర్థిత (Value added) సరుకులుగా మార్చి సంపదను సృష్టించాలి. ఉద్యోగాలు కల్పించాలి. వీటన్నింటికీ పెట్టుబడి, మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణా సామర్థ్యంలాంటివి అవసరం. ప్రస్తుతానికి చిల్లర వ్యాపారంలో వరస అమ్మకం కేంద్రాలను నెలకొల్పే భారతీయ సంస్థలపై ఎలాంటి ఆంక్షలూ లేవు. కానీ అవి అంతగా ప్రభావం చూపలేక పోయాయి. భారతీయ పరిశ్రమలు సాధారణంగా బహుళ జాతి కంపెనీలను వ్యతిరేకిస్తాయి. పోటీని సహించవు. కానీ చిల్లర వ్యాపారానికి సంబంధించినంత వరకు పరిశ్రమలు సరళీకరణ కావాలంటున్నాయి. సరుకు నిలవ చేయడం వంటి విషయాల్లో అరకొర సరళీకరణ వల్ల ఎక్కువ పెట్టుబడి సమకూరలేదు.

ఈ కీలక రంగంలో ఎవరు పెట్టుబడి పెడతారు అన్నది నిజానికి అంత ముఖ్యం కాదు. "పిల్లి నల్లదో తెల్లదో అన్న దానితో నిమిత్తం లేదు. ఎలకలను పడితే చాలు" అని డెంగ్జియావ్ పింగ్ అనే వారు. మార్కెట్‌కు దూరం తగ్గడం, నమ్మకం కలిగించే రవాణా తదితర సదుపాయాలు, మూల్యవర్ధన





చర్యలు మొదలైన వాటిని వ్యవస్థీకృత చిల్లర వ్యాపార సంస్థలు సమకూరుస్తాయి. దాని వల్ల రైతుకు సరైన ధర అంది వినియోగదారుడికి చౌకగా సరుకు అందుతుంది. సమర్థంగా, పోటీ వల్ల వ్యాపారులకు లాభాలు తగ్గుతాయి. కాని అధిక మొత్తంలో సరుకు అందడం వల్ల ఆ లోటు పూడ్చుకోగలుగుతారు. అంతకన్నా ముఖ్యమైంది. సరుకు వృధా కావడం తగ్గుతుంది. వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెస్ చేయడం నిలవ చేయడం, వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు స్ఫూర్తి కలుగుతుంది. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పట్టణీకరణ సక్రమంగా జరుగుతుంది. ధరలలో హెచ్చుతగ్గుల బాధ బాగా తగ్గుతుంది.

మార్కెట్లు మెరుగు పడితే వ్యవసాయరంగంలోకి అధిక

పెట్టుబడులు సమకూరుతాయి. ఎక్కువ ధర రైతులకు మేలు చేస్తుంది కనక వారు నాణ్యతను, దిగుబడిని పెంచడానికి ఉత్సాహం చూపుతారు. సాంకేతికతను, కాంట్రాక్టు వ్యవసాయ విధానాన్ని ఆమోదిస్తారు. ఇది అన్ని రకాలుగానూ లాభదాయకమైందే.

అయితే పోటీ సవ్యంగా, సమర్థంగా ఉండేట్టు చూసి గుత్త వ్యాపారాన్ని అరికట్టాలి. కొరత ఉన్నప్పుడు తప్ప చిల్లర దుకాణాల నిర్వాహకులు స్వదేశీ సరుకు మాత్రమే సేకరించేట్టు జాగ్రత్త పడాలి. వంటనూనెల వంటి వాటి విషయంలో దిగుమతులు అనివార్యం అయితే స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించడానికి, ధరలను దృష్టిలో ఉంచుకుని కస్టమ్స్ సుంకాన్ని హేతుబద్ధంగా నిర్ణయించాలి. పరిశ్రమల విషయంలో అయితే అవి చిన్న, మధ్యతరహా పరిశ్రమల నుంచి 30 శాతం కొనుగోలు చేసి తీరాలన్న నియమం ఉంది.

చిల్లర వ్యాపారం భారీ సంఖ్యలో ఇప్పుడు ఉపాధి కల్పిస్తోందన్న వాదన ఉంది. ఈ రంగంలో మూడు కోట్ల మంది అంటే మొత్తం జనభాలో ఏడు నుంచి ఎనిమిది శాతం మంది ఆధారపడి ఉన్నారు. అయితే ఈ చిల్లర దుకాణాల్లో పని చేసే వారికి వచ్చే ఆదాయం చాలా స్వల్పం. వీరిలో పదిశాతం మంది మాత్రమే పెద్ద నగరాల్లో పని చేస్తారు. ఈ నగరాల్లోనే విదేశీ చిల్లర వ్యాపార సంస్థలను అనుమతిస్తున్నారు. ఇలాంటి నగరాలలో దాదాపు 30 లక్షల మంది చిల్లర దుకాణాల్లో పనిచేస్తున్నారు. భారీ స్థాయిలో వరస చిల్లర దుకాణాలు నెలకొనడం వల్ల ప్రతి ఏటా 1.7 శాతం చిల్లర దుకాణాలు ఆ పోటీకీ తట్టుకోలేక మూత పడుతున్నాయి. అంటే పెద్ద నగరాల్లో 51,000 మందికి విదేశీ చిల్లర దుకాణాల వల్ల ఉపాధి దొరక్కుండా పోవచ్చు. విదేశీ చిల్లర దుకాణాల వల్ల వచ్చే అయిదేళ్ల కాలంలో 15 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి దొరుకుతుందని అంచనా, రవాణా, మౌలిక సదుపాయాలు, మూల్యవర్ధనం వంటి రంగాలలో మరో 15 లక్షల మందికి ఉపాధి దొరకొచ్చు. చిన్న వ్యాపారులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పించవచ్చు. మన విధానం ఇలాంటి రక్షణలు కల్పించాలి. ఈ పరివర్తనా కాలంలో చిన్నపాటి చిల్లర దుకాణాల స్థాయి పెంచాలి. ఫ్రాంచైజీలను, సహకార వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ఎన్‌డిడిబి లాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాలి.

చిల్లర వ్యాపారం ఏటా 13.3 శాతం (CAGR 2006-10) చొప్పున పెరుగుతోంది. ఆధునిక చిల్లర వ్యాపారం ఏటా 25శాతం చొప్పున పెరుగుతుందని అంచనా. చిన్నస్థాయి చిల్లర వ్యాపారం ఏటా 10 శాతం లేదా అంతకన్నా కొంచెం ఎక్కువగా పెరుగుతుంది. అంటే పెద్ద నగరాల్లో కూడా విదేశీ చిల్లర వ్యాపార సంస్థలు వచ్చినా 75శాతం వ్యాపారం చిల్లర వ్యాపారుల చేతిలోనే ఉంటుంది. అయిదేళ్ల కాలంలో చిల్లర వ్యాపారం రెట్టింపు అవుతుంది. చిన్న స్థాయి చిల్లర వ్యాపారం 50శాతం పెరుగుతుంది. అత్యంత అనుకూలమైన పరిస్థితుల్లో కూడా తూర్పు ఆసియా దేశాల్లో వ్యవస్థీకృత చిల్లర వ్యాపారం 25 నుంచి 30 శాతం మించి పెరగలేవని అనుభవ పూర్వకంగా తేలింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడం, ఈ వ్యాపార నిర్వహణకు చేసే ఏర్పాట్ల వల్ల అసలు ప్రయోజనం సమకురుతుంది.

మరో అంశం దేశంలో పెట్టుబడులు, అభివృద్ధిరేటు. 2002లో మన పొదుపు రేటు డిజిపిలో 23 శాతం ఉంటే 2008లో అది 37శాతానికి పెరిగింది. 2011లో 32 శాతంకు తగ్గింది. దశాబ్ద కాలంగా కుటుంబాల పొదుపు 22శాతం దగ్గర నిలకడగా ఉంటే కార్పొరేట్ సంస్థల, ప్రభుత్వ పొదుపు తగ్గింది. అభివృద్ధి పుంజుకోవడంలో పెట్టుబడి సమకూరడానికీ ప్రధాన పాత్ర. పెట్టుబడికి కటకటగా ఉన్న దేశంలో ఎఫ్‌డిఐ వల్ల అభివృద్ధికి ప్రోత్సాహం లభిస్తుంది.

చివరగా మన కరెంట్ అకౌంట్ లోటు దాదాపు 78.2 బిలియన్ డాలర్లు ఉంది. అంటే ఇది జిడిపిలో 4.4శాతం. మనకున్న విదేశీ మారక ద్రవ్య నిల్వల ఆధారంగా ఈలోటు భరించడం కష్టం. విదేశాలనుంచి డబ్బు సమకూరడం, విదేశీ వ్యవస్థాపరమైన పెట్టుబడులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వల్లే ఈ లోటు పూడ్చగలం. ప్రవాస భారతీయులు మన దేశంలోని ఏటా 50 బిలియన్ డాలర్లు పంపిస్తున్నారు. ఈ మొత్తం స్థిరంగా కొనసాగుతోంది. పెట్టుబడి మార్కెట్ పుంజుకుంటే విదేశీ సంస్థాగత పెట్టుబడులూ పెరుగుతాయి. కాని ఈ డబ్బు మన దేశంలో స్థిరంగా ఉంటుందని చెప్పలేం. మన దేశంలో కానీ, మరెక్కడైనా గానీ ఇబ్బంది ఎదురైతే ఆ పెట్టుబడి మాయం అవుతుంది. మనకు ప్రత్యేక్ష విదేశీ పెట్టుబడుల రూపంలో స్థిరమైన, దీర్ఘకాలికమైన పెట్టుబడులు అవసరం. దానితో పాటు సాంకేతికత సమకూరుతుంది. అభివృద్ధి, ఉపాధి, ఆదాయాలు పెరుగుతాయి.

మొత్తం మీద చూస్తే చిల్లర వ్యాపారంలో ప్రత్యక్ష విదేశీ పెట్టుబడిని జాగ్రత్తగా సమకూర్చుకోగలిగితే అన్ని రకాలుగా ప్రయోజనం ఉంటుంది. అయితే విస్తృతం, వైవిధ్యభరితం అయిన భారత్ లాంటి ఆర్థిక వ్యవస్థలో సత్వర పరిష్కారాలు, సర్వరోగ నివారిణిలకు అవకాశం ఉండదు. ■

# డీజిల్, గ్యాస్ సబ్సిడీలు ఎవరు చెల్లించాలి?

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**

సబ్సిడీలను తగ్గించడానికి డీసిల్, ఎల్‌పిజి ధరలను పెంచినందు వల్ల దేశ వ్యాప్తంగా రసవత్తరమైన చర్చ జరుగుతోంది. ఈ చర్చ ప్రధానంగా కునారిల్లి పోయిన మన ద్రవ్య స్థితి మీదే కేంద్రీకృతం అయింది. అయితే మూడు ముఖ్యమైన ప్రశ్నలు ఈ చర్చలు ప్రస్తావనకే రాలేదు. ప్రైవేట్ వినియోగానికి వాడే వస్తువులకు అయ్యే ఖర్చు ఎవరు భరించాలి? వినియోగదారుడా లేక పన్నులు చెల్లించే పౌరులా? ప్రభుత్వ పాత్ర ఏమిటి? పేదరికం విస్తారంగా ఉన్నప్పటికీ త్వరిత గతిన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో అనుసరించదగిన ఉత్తమ వ్యూహం ఏమిటి?

భారత్ ఎదుర్కుంటున్న ద్రవ్యపరమైన సవాలు చాలా తీవ్రమైంది. 2012-13 బడ్జెట్‌లో ద్రవ్యలోటు జిడిపిలో 5.1శాతం ఉంటుందని అంచనా వేశారు. తాజా అంచనాల ప్రకారం ఆ లోటు 5.8శాతం ఉండొచ్చుననుకుంటున్నారు. పరిపాలనా వ్యయం, వేతనాలు చెల్లించడం, దేశ రక్షణ, తమకున్న అప్పులకు వడ్డీలు చెల్లించడం వంటి ప్రభుత్వ వ్యయాన్ని నివారించలేం. ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం పెరగడం, అవసరాలు పెరగడం, దేశ రక్షణ అవసరాలు పెరగడం, చెల్లించాల్సిన వడ్డీలు పెరగడం వల్ల ప్రభుత్వ వ్యయమూ పెరుగుతుంది. మిగతా ఖర్చులను మాత్రమే పాక్షికంగా తగ్గించుకోగలం. దీనిలో కూడా రోడ్డు, రైల్వేలు, విద్యుదుత్పత్తి కేంద్రాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థలు, సహజ వనరుల అభివృద్ధి, సమాచార గ్రిడ్ వంటి మౌలిక సదుపాయాలకు అయ్యే ఖర్చును, మంచినీరు, పారిశుధ్యంవంటి మౌలిక అవసరాలను తీర్చడానికి అయ్యే ఖర్చును నివారించలేం. ఇవన్నీ కీలకమైన ఖర్చులే. పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాలను తీర్చడానికి వాస్తవానికి పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉంది. రాబోయే కొద్ది సంవత్సరాలలో మౌలిక, సదుపాయాల కల్పనకు భారత్ వెయ్యి బిలియన్ డాలర్లు చెల్లించాల్సి ఉందని అందరూ అంగీకరిస్తున్నారు. అభివృద్ధి, ఆదాయం ఆ మేరకు కుంటుపడతాయి.

దీనికి తోడు విద్య, ఆరోగ్య పరిరక్షణ వంటి సామాజిక, మౌలిక, సదుపాయాలు కల్పించాల్సిన అవసరమూ ఉంది. విద్యారంగం కోసం కేంద్ర, రాష్ట్రాలు ఖర్చు పెడుతున్నది 2.98 శాతం మాత్రమే. ఆరోగ్య పరిరక్షణకు చేస్తున్న వ్యయం 1.27 శాతం మాత్రమే. ప్రపంచ స్థాయిలో చూస్తే ఇది అనేక దేశాలకన్న చాలా తక్కువ.

విద్య, ఆరోగ్య రంగాలను మెరుగు పరచడానికి ఎక్కువ మొత్తం ఖర్చుపెట్టలేకపోతే మన ఆర్థిక వ్యవస్థ దృఢంగా ఉండదు. మనవాభివృద్ధి సూచికలో భారత్ ఎప్పుడూ కిందనుంచి మూడో స్థానంలో మాత్రమే ఉంటోంది. అధికంగా ఉన్న జనాభా వనరులను వినియోగించుకుని అభివృద్ధిని పెంపొందించాలని కలలుకంటున్న దేశంలో ఈ గణాంకాలన్నీ ఆందోళన కలిగించేవే. అందువల్ల సామాజిక రంగంలో మన పెట్టుబడి పెంచాలి తప్ప తగ్గించకూడదు.

ఇక మిగిలింది సబ్సిడీలు. మన సబ్సిడీల్లో ఎక్కువ భాగం ప్రభుత్వ పంపిణీ విధానం ద్వారా ఆహార పదార్థలు సరఫరా చేయడానికే ఎక్కువగా ఖర్చవుతోంది. రసాయనిక ఎరువుల సరఫరా, పేదలకు నేరుగా సహాయ పడడానికి మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి పథకం, వృద్ధాప్య పించన్లు, ఇంధన సరఫరాలకు సబ్సిడీలు భరించాల్సి వస్తోంది. ఆహార సబ్సిడీల విషయంలో అందవలసిన వారికి కచ్చితంగా సబ్సిడీ అందించవలసిన అవసరం ఉంది; ఆకలిని, పోషకాహార లోపాన్ని అంతమొందించాల్సిన అవసరం ఉంది. రసాయనిక ఎరువుల సరఫరాకు సబ్సిడీని ఇప్పటికే, గణనీయంగా



తగ్గించాం. మరింత తగ్గిస్తే వ్యవసాయోత్పత్తులు తగ్గుతాయి. పేదరికం. నుంచి ప్రజలను రక్షించడానికి పేదలకు నేరుగా ప్రభుత్వ సహాయం అందించడం సబబే అని అందరూ అంగీకరిస్తున్నారు.

ఇంధన సరఫరాలో సబ్సిడీలు అదుపుతప్పాయి. చమురు, గ్యాస్ రంగాల్లో 2010-11లో రూ॥78190 కోట్లు భరించాల్సి వచ్చింది. (జిడిపిలో 1.07 శాతం), 2011-12లో ఇది రూ॥138541 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం పెంచిన చమురు ధరలను పరిగణనలోకి తీసుకోకుండా చూస్తే 2012-13లో ఇదే రూ॥187000 కోట్లకు చేరేది(జిడిపిలో దాదాపు 2 శాతం). డీసిల్ ధర పెంచడం, ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లను మాత్రమే సరఫరా చేయాలన్న ఇటీవలి నిర్ణయాన్ని బట్టి చూసిన, తద్వారా రూ॥20,300 కోట్లు ప్రభుత్వానికి అదనంగా సమకూరుతుందని అనుకున్నా భరించాల్సిన మొత్తం రూ॥167000 కోట్లు ఉంటుంది (జీడిపిలో 1.7శాతం). ఇంత స్థాయిలో చమురు, గ్యాస్‌కు సబ్సిడీ భరించడం కష్టం. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడం (సగటున బారెల్‌కు 100-200డాలర్లు), రూపాయి మిలువ తగ్గడం (ఇది డాలర్‌కు రూ॥46 నుంచి రూ॥56కు తగ్గింది) వల్ల చమురు సబ్సిడీలు గణనీయంగా పెరిగాయి. ద్రవ్యలోటు భరించగలిగిన స్థాయిలో ఉండాలంటే బాధాకరమైనా చమురు ధరలు పెంచక తప్పదు.

ద్రవ్యలోటు, అప్పులు పెరుగుతున్న దశలో నిష్క్రియా పరంగా ఉండలేం. దీనివల్ల రెండు ప్రమాదాలు ఉన్నాయి. ఒకటి ద్రవ్యలోటు పెరిగి ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది. రెండు భారత క్రెడిట్ రేటింగ్ తరిగి వడ్డీ రేట్లు పెరుగుతాయి. ఎక్కువ అప్పులు తీసుకోవడం, ఎక్కువ వడ్డీలు చెల్లించడం వల్ల ప్రభుత్వ వ్యయం నికరంగా పెరుగుతుంది.

రోడ్లు, ఆనకట్టలు, పాఠశాలలు, ఆస్పత్రుల వంటి వాటికి అయ్యే ఖర్చును ప్రభుత్వ ఖజానానుంచి లేదా పన్నులు చెల్లించేవారు భరించాల్సిందే. వీటిని ఎవరూ ప్రత్యేకంగా వినియోగించరు కనుక ఈ ఖర్చు అనివార్యం. ఆర్థికాభివృద్ధికి, వ్యక్తిగత అవకాశాలకు ఈ వ్యయం తప్పదు. కానీ ప్రైవేట్ వినియోగానికి వాడుకునే చమురు ఖర్చు భారాన్ని, పన్నులు చెల్లించే వారి మీద మోపడం న్యాయం కాదు. ఒక వ్యక్తి తన కతురికి ఐస్‌క్రీం ఇప్పించడానికి వాహనం మీద బయటకు తీసుకెళితే. దానికోసం అయ్యే ఇంధన ఖర్చు ప్రభుత్వం భరించడం అన్యాయం. డబ్బు చెట్లకు కాయదు. చమురు ధరల్లో లోటు ఏర్పడితే దానిని ఎవరో ఒకరు భరించాల్సిందే. అయితే ప్రైవేటు వినియోగానికి అయ్యే ఖర్చు ఎవరు భరించాలన్నదే ప్రశ్న. పన్నులు చెల్లించే వారు భరించాలా? వినియోగదారులు భరించాలా? ఇలాంటి సందర్భాలలో వినియోగాదారులు భరించడమే సమంజసం. అప్పుడే ధరల ద్వారా గిరాకీ, సరఫరా విషయాల్లో ఆర్థిక సూత్రాలు సవ్యంగా పనిచేస్తాయి. వినియోగదారులు వివేకంతో ప్రవర్తిచగలుగుతారు. ఈ ప్రైవేట్ వ్యయాన్ని ప్రభుత్వం భరించాలన్న వాదన తిరోగమన చర్య భరించడానికి. ప్రభుత్వ రవాణాకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలనడంలో అర్థం ఉందికాని ప్రైవేట్ వినియోగానికి కాదు.

ఇక్కడే రాజ్యం పాత్ర ఏమిటి అన్న ప్రశ్న ఎదురవుతుంది. దీర్ఘకాలికంగా సాధించదలిచే ప్రజా శ్రేయస్సును పెంపొందించడానికి చెల్లించే స్వల్పకాలిక, రాజకీయ మూల్యం ఎంత అన్నదే ప్రజాస్వామ్య పరిపాలనలో కీలకమైన సవాలు. రేపటి గురించి లెక్కచేయకుండా స్వల్పకాలికంగా ప్రయోజనకరమైన మార్గాన్ని అనుసరించడం సులభమే. కుటుంబానికైనా, జాతికైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. పిల్లలు టీవీ చూడడానికి, సోషల్ మీడియాను వినియోగించడానికి అపరిమితమైన అవకాశాలు ఇవ్వాలా, లేదా, పిల్లలు తమ సమయాన్ని చదువుకు, క్రీడలకు కేటాయించమని చెప్పాలా అన్నది తల్లిదండ్రులకు కష్టతరమైన అంశమే. చమురు ధరలపై సబ్సిడీ ఇవ్వడం వల్ల ప్రజాశ్రేయస్సును పరిరక్షిస్తున్నాం, పేదలను ఆదుకుంటున్నాం అన్న వాదన సమంజసం కాదు. దీని బండారాన్ని బట్టబయలు చేయాల్సిందే.

ఆధునిక రాజ్యం పాత్రను పరిశీలించాలి. శాంతిని కాపాడడం, న్యాయం అందజేయడం, చట్టబద్ధ పాలనకు అందించడం రాజ్యం ప్రథమ కర్తవ్యం. ఈ ప్రాథమిక కర్తవ్యాన్ని నిర్వర్తించని రాజ్యానికి చట్టబద్ధమైన హక్కు ఉండదు. రాజ్యం నిర్వర్తించాల్సిన రెండో రకం విధుల్లో అందరికీ ఉపయోగ పడే సదుపాయాలు కల్పించడం, రవాణా, విద్యుత్తు, నీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం ఉంటాయి. సహజ వనరులను నిలకడగా వినియోగించడం కూడా రాజ్యం బాధ్యతే. మూడో ప్రాధాన్యం ప్రతి శిశువుకు నాణ్యమైన విద్య, నాణ్యమైన ఆరోగ్య పరిరక్షణ అందించడం, ఈ సేవలు అందించక పోతే శిశువు భవిష్యత్తును పుట్టుక, సామాజిక స్థితి నిర్ణయించే ప్రమాదం ఉంటుంది. వానివల్ల పేదరికం పెరుగుతుంది. చివరగా శాంతి పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, మానవాభివృద్ధి సాధించడం వంటి అంశాల తర్వాత

రాజ్యం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి అవసరం ఉన్న వారిని ఆదుకోవాల్సి ఉంటుంది.

కానీ రాజకీయ పార్టీలు తమ ప్రాథమిక కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేసే సంస్కృతికి అలవాటు పడడం విచారకరం. ఓటు బాంకులను కాపాడుకోవడానికి తయిలాల మీద ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నాయి. న్యాయమార్గ పాలన, శాంతి పరిరక్షణ దారుణంగా ఉన్నాయి. మన రవాణా వ్యవస్థ, విద్యుత్ రంగ మౌలిక సదుపాయాలు ఆర్థిక వ్యవస్థకు భారంగా తయారయ్యాయి. అంతర్జాతీయంగా విద్య విషయంలో ఇటీవల 74 దేశాలకు సంబంధించి సర్వే చేస్తే భారత్ 73వ స్థానంలో ఉంది. మన అదృష్టం ఏమిటంటే మనకన్నా దిగువన కజకిస్థాన్ ఉంది. మనం దానికన్నా ఒక మెట్టు పైనే ఉన్నాం. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే మన ఆరోగ్య వ్యవస్థ అత్యంత నాసిరకంగా ఉంది. కాని తాయిలాల విషయంలో మాత్రం బహుశా మనం అన్ని దేశాల కన్నా ముందుండి ఉంచాం.

దీనికి అన్ని పక్షాల బాధ్యత ఉంటే, కేంద్రం కూడా మినహాయింపు కాదు. రుణ మాఫీలు, ఇప్పుడైతే ఉచిత మొబైల్ ఫోన్లు, శ్రామికుల కొరత ఉన్న చోట కూడా ఉపాధి హామీ, పెట్రోలు, వంటగ్యాస్ సబ్సిడీ, కిరోసిన్ సబ్సిడీ మొదలైనవి మాఫియా రాజ్యాన్ని సృష్టిస్తున్నాయి. ఇవన్నీ కేంద్రం తప్పిదాలే. రాష్ట్రాలకు ఆదర్శ ప్రాయంగా ఉండాల్సిన కేంద్రం ద్రవ్యలోటు పెంచడానికి, ప్రమాదకరమైన జనకర్షక విధానాలకు పాల్పడుతోంది.

ఓట్లకోసం సాగుతున్న ఈ వేలం వెర్రిలో ప్రజలను కేవలం ఓటు బాంకులుగానే పరిగణిస్తున్నారు. సామర్థ్యాన్ని, ఆదాయాలను పెంచకుండా పేదరికాన్ని పెంచుతున్నారు. ప్రభుత్వం మీద ఆధారపడే పరిస్థితిని కల్పిస్తున్నారు. ప్రజలను నిరంతరం బానిసలుగా ఉంచుతున్నారు. చివరకు మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో పెట్టుబడి అరకొరగా తయారువుతోంది. దీనివల్ల అభివృద్ధి కుంటుపడి అసమానతలు పెరుగుతున్నాయి. పేదలకు సబ్సిడీలు, సహాయం ఇవ్వడం అవసరమనే అంశాన్ని అంగీకరించవచ్చు. అలాంటి సహాయం విద్య, ఆరోగ్యం, ఉద్యోగాలు, రుణాలు, గృహవసతి, మౌలిక కల్పన కోసమైతే ఇవ్వొచ్చు కాని వారి ఖర్చులకోసం కాదు.

భారత ఇంధన భద్రతపై దృష్టి సాదించాల్సిన అవసరం ఉంది. చమురు ఉత్పత్తి విషయంలో మన దేశం 24వ స్థానంలో ఉంటే వినియోగంలో మాత్రం నాల్గవ స్థానంలో ఉంది. ప్రతిరోజూ మనకు కావాల్సిన చమురు 3.2 మిలియన్ బారెళ్లు, అంటే ప్రపంచమంతా వినియోగించుకునే చమురులో మనం 3.7 శాతం వాడుతున్నాం. మన చమురు ఉత్పత్తి రోజుకు 87800 బారెళ్లు, అంటే ప్రపంచ చమురు ఉత్పత్తిలో మన వాటా ఒక్క శాతం మాత్రమే. గత రెండేళ్ల కాలంలో మన చమురు దిగుమతి వ్యయం మొదటి సంవత్సరంలో 40 శాతం, రెండో సంవత్సరంలో 43 శాతం పెరిగింది. ఇప్పుడు దీని కోసం రూ॥726386 కోట్లు ఖర్చుపెట్టాల్సి వస్తోంది. 2012లో 186.7 మిలియన్ టన్నుల చమురు దిగుమతికి 140 మిలియన్ డాలర్లు వెచ్చించాం. రూపాయి మారకం ఎగుడు దిగుళ్లు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇవి స్వల్ప కాలికం కావచ్చు కాని దీర్ఘకాలిక సంక్షోభం పొంచి ఉంది. జిడిపిలో వాటా లెక్కన చూస్తే ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నింటిలో మన చమురు దిగుమతి వ్యయం అన్ని దేశాలకన్నా ఎక్కువ. ఒక్క దక్షిణాఫ్రికాకు మినహాయిస్తే బ్రెజిల్, రష్యా, చైనా, మెక్సికోతో పోల్చి చూస్తే మన చమురు ఉత్పత్తే చాలా తక్కువ. అంతర్జాతీయంగా చమురు ఉత్పత్తి రోజుకు 90.8 మిలియన్ బారెళ్లు ఉంటే, గిరాకీ, రోజుకు దాదాపు 88 మిలియన్ బారెళ్లు ఉంటే, అంటే గిరాకీ సరఫరా మధ్య చాలా స్వల్పమైన తేడా మాత్రమే ఉంది. సహజంగానో, మానవ కల్పితంగానో సంక్షోభం ఎదురైతే చమురు ధరలు మరింత పెరుగుతాయి. అప్పుడు జిడిపిలో 4.4 శాతంగా ఉన్న మన వాణిజ్య లోటు మరింత దిగజారుతుంది.

దీర్ఘకాలికంగా అంతర్జాతీయంగా చమురు ఉత్పత్తి గరిష్ఠస్థాయినితాకి ఆ తర్వాత తగ్గుతుంది. కానీ పేద దేశమూ, అపారంగా చమురు దిగుమతి చేసుకునే మన దేశం భారీ కుదుపులు ఎదుర్కొవాల్సివస్తుంది. జీవ ఇంధనాలు, సౌరవిద్యుత్తు వంటి వాటిని పెంపొందించడమే వివేకవంతమైన చర్య. అయితే ప్రత్యామ్నాయ ఇంధన వనరులు ఉంటేనే ఇది సాధ్యం అవుతుంది. వాస్తవ ధరకు అనుగుణంగా చమురు ధరలు ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. చమురు, గ్యాస్‌కు సబ్సిడీలు ఇస్తూ పోతే శైశవ దశలో ఉన్న ప్రత్యామ్నాయ ఇంధన పరిశ్రమకు ప్రాణాంతకంగా మారుతుంది. అప్పుడు దిగుమతుల మీద మరింతగా ఆధారపడడం, అధిక ధర చెల్లిచాల్సి రావడం, కుదుపులు ఎదుర్కొవడం తప్పదు. అభివృద్ధి నిలకడగా సాగాలంటే స్వదేశీ ప్రత్యామ్నాయ ఇంధన వనరులను పెంపొందించాలి. దీర్ఘకాలిక ఇంధన భద్రతకు, ఆర్థికాభివృద్ధికి చమురు ధరలు చాలా అవసరం. ■

# కఠిన నిర్ణయాలకు సమయం వచ్చింది

డా॥ మన్మోహన్‌సింగ్, భారత ప్రధాని

***ఆర్థిక సంస్కరణలపై చేసిన నిర్ణయాలను వివరించడానికి దేశ ప్రజల్ని ఉద్దేశించి డా॥ మన్మోహన్‌సింగ్ చేసిన ప్రసంగంలోని కొన్ని ముఖ్యాంశాలను ఇస్తున్నాం. దేశానికి ఆర్థిక, రాజకీయ సంస్కరణల అవసరాన్ని ఎవరూ కాదనరు. సంక్షోభం తలెత్తినప్పుడు తక్షణ పరిష్కారాలు తాత్కాలిక ఏర్పాట్లకు మాత్రమే సంస్కరణలను పరిమితం చేస్తే అవి ప్రజలకు ఫలితాలనిచ్చేవి కాకుండా భారాలను మోపేవిగానే మిగిలే అవకాశం వుంది. సమగ్రమైన సంస్కరణలకి శ్రీకారం చుట్టకపోతే ప్రజల ఆమోదానికి బదులు తిరస్కరణే ఎదురవుంది. ఈ సంస్కరణలపై చర్చించుకోడానికి ప్రధాని చేసిన ప్రసంగం ప్రాతిపదికగా ఉపయోగపడుతుందని భావిస్తున్నాం.***

### భవిష్యత్తును రక్షించే బాధ్యత సర్కారుదే

ప్రభుత్వం తాజాగా తీసుకున్న ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాల గురించి వివరించడానికే నేను మీతో మాట్లాడుతున్నా. కొన్ని రాజకీయ పార్టీలు వాటిని వ్యతిరేకించాయి. మేం ఎందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నామో... ఆ వాస్తవాలు తెలుసుకొనే హక్కు మీకుంది. ఏ ప్రభుత్వమూ సామాన్యుడిపై భారం మోపాలనుకోదు. సామాన్యుడి ప్రయోజనాలను కాపాడేందుకు మాకు రెండు సార్లు అధికారం కట్టబెట్టారు. అదే సమయంలో జాతి ప్రయోజనాలకు మద్దతు పలికి ప్రజల దీర్ఘకాల భవిష్యత్తును రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. మన ఆర్థిక వృద్ధి వేగంగా జరిగేలా భరోసా ఇవ్వాలి. అలాంటి వృద్ధే మన దేశ యువతకు తగినన్ని ఉద్యోగాలు కల్పిస్తుంది. విద్య, ఆరోగ్యం, గృహ నిర్మాణం, గ్రామీణ ఉపాధి పథకాలకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడానికి కూడా వేగవంతమైన వృద్ధి అవసరమే. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గొప్ప ఇబ్బంది ఎదుర్కొంటున్న తరుణంలో మనం ఈ పని చేయాల్సి రావడం సవాల్. అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఐరోపా దేశాలు ఆర్థిక మందగమనం, ద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొవడానికి కష్టపడుతున్నాయి. ఆఖరికి చైనా కూడా మందగమనంలో వెళ్తోంది. మనపై కూడా ప్రభావం ఉంది. ప్రపంచ సంక్షోభ ప్రభావాన్ని మనం తగ్గించుకో గలిగామని నేను నమ్ముతున్నా. వృద్ధిలో తలెత్తిన మందగమనాన్ని సరిదిద్దుకొనే స్థితిలో మనం ఉన్నాం. ఇంటా, బయటా పెట్టుబడిదారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ధరించాల్సి ఉంది. దీనికోసమే తాజా నిర్ణయాలు తీసుకున్నాం.

### పెట్రోభారం మొత్తం నెత్తిన వేయలేదు

డీజిల్ ధరల పెంపు, ఎల్పీజీ సిలిండర్లపై పరిమితి విధిస్తూ



తీసుకున్న నిర్ణయాల గురించి ముందు చెప్పనివ్వండి. మనం దాదాపు 80% చమురు ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటాం. గత నాలుగేళ్లుగా అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ పెరుగుదలను దాదాపు వినియోగదారుడి మీదికి మళ్లించలేదు. సాధ్యమైనంత వరకు మిమ్మల్ని ఇబ్బందుల నుంచి రక్షించగలిగాం. పెట్రో ఉత్పత్తులపై సబ్సిడీ భారం విపరీతంగా పెరిగింది. గత ఏడాది ఇది రూ॥1.40 లక్షల కోట్లు. ఇప్పుడు స్పందించకపోతే ఈ సంవత్సరం ఇది రూ॥2లక్షల కోట్లకు చేరుతుంది. దీనికి డబ్బెక్కడి నుంచి వస్తుంది? డబ్బు చెట్లకు కాయదు. మనం స్పందించకపోతే అది గరిష్ట ద్రవ్యలోటుకు దారి తీస్తుంది. ప్రభుత్వాదాయ, వ్యయాల మధ్య సమతౌల్యం కష్టమవుతుంది. దీన్ని చక్కదిద్దకపోతే మరింత ధరల పెరుగుదలకు దారితీస్తుంది. మన ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం సన్నగిల్లేలా చేస్తుంది. నిత్యావసర

ధరలు వేగంగా పెరుగుతాయి. మన ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెట్టడానికి దేశ, విదేశీ పెట్టుబడిదారులు విముఖత చూపుతారు. వడ్డీ రేట్లు పెరుగుతాయి. విదేశాల నుంచి మన కంపెనీలకు అప్పులు పుట్టవు. నిరుద్యోగం పెరిగిపోతుంది.

**మనపై ప్రపంచం దయ చూపదు**

మనం 1991లో ఈ సమస్య ఎదుర్కొన్నాం మనకు చిన్న మొత్తం అప్పు ఇవ్వడానిక్కూడా ఎవ్వరూ ఇష్టపడలేదు. బలమైన కట్టుదిట్ట చర్యలు తీసుకోవడం ద్వారా ఆ సంక్షోభం నుంచి బయటపడ్డాం. ఆ నిర్ణయాల సానుకూల ఫలితాలు మీరు చూడొచ్చు. మనం ఇప్పుడు ఆ పరిస్థితుల్లో లేం. కానీ, దేశంపై ఇతరులు విశ్వాసం కోల్పోయే లోపే మనం స్పందించాలి.

1991లో ఏం జరిగిందో నాకు తెలుసు. గట్టి నిరోధక చర్యలు తీసుకోకపోతే ఈ గొప్ప దేశ ప్రధానిగా నేను నా విధి నిర్వహణలో విఫలమవుతాను. సొంత సమస్యలు పరిష్కరించుకోని వారిపై ప్రపంచం దయ చూపదు. చాలా ఐరోపా దేశాలు ఇప్పుడు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. అవి సొంత బిల్లులు చెల్లించుకోలేక ఇతరుల సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. రుణదాతలను సంతృప్తి పరచడానికి అవి వేతనాలు, పింఛన్లలో కోత పెట్టడానికి సిద్ధమవుతున్నాయి.

**ధనికులకు సబ్సిడీ ఇమ్మంటారా?**

భారత్‌ను ఆ పరిస్థితుల్లో చూడరాదన్నదే నా దృఢసంకల్పం. మనం ఎందుకు ఈ చర్య తీసుకోవాల్సి వచ్చిందో మిమ్మల్ని నమ్మించినప్పుడే నేను విజయవంతమైనట్లు లెక్క. డీజిల్‌పై ఎదురవుతున్న నష్టాలను పూడ్చుకోవడానికి లీటర్‌కు రూ॥17 పెంచాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ॥5 పెంచాం. ధనికులు ఎక్కువగా వాడే పెద్ద కార్లు, ఫ్యాక్టరీలు, వ్యాపారాలకే డీజిల్ వాడతారు. ఇలాంటి వాళ్లకు సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వాన్ని భారీ ద్రవ్యలోటుతో నడపమంటారా? ఏడాదికి ఆరు ఎల్పీజీ సిలిండర్లపై పరిమితి విధించాం. దాదాపు సగం జనాభా, మన సాయం కోరే వారు వాస్తవానికి యేటా ఆరు సిలిండర్ల కంటే తక్కువే వాడుతున్నారు. వారిపై ఎలాంటి ప్రభావం పడకుండా భరోసా ఇచ్చాం. మిగతా వారికి ఆరు సిలిండర్లు వస్తాయి అంతకు మించి కావాలంటే ఎక్కువ ధర చెల్లించాల్సి ఉంటుంది. నిరుపేదలు వాడే కిరోసిన్ ధరలు జోలికి పోలేదు.

**పొరుగుదేశాల కన్నా తక్కువే!**

ధరలు పెంచిన తర్వాత కూడా మన దేశంలో డీజిల్, ఎల్పీజీ



ధరలు బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్‌ల కంటే తక్కువే ఉన్నాయి. ఇప్పటికీ పెట్రో ఉత్పత్తులపై సబ్సిడీ భారం రూ॥1.60 లక్షల కోట్లుంది. విద్య, వైద్యరంగాలకు కలిపి ఖర్చు చేసే దానికంటే ఇది ఎక్కువ. ఈ ధరలు మరింత పెరగకుండా మనం తప్పించుకున్నాం. ఇక ముందు చమురు ధరలు తగ్గుతాయి.

### చిన్న, పెద్దా కలిసి ఎదగొచ్చు

చిల్లర వర్తకంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఎందుకు అనుమతివ్వాల్సిందో చెప్పనివ్వండి. ఇది చిన్న వ్యాపారులను దెబ్బతీస్తుందని కొందరు చెబుతున్నారు. కానీ అది నిజం కాదు. సంఘటిత, ఆధునిక చిల్లర వర్తకం దేశంలో ఇప్పటికే ఉంది. అది నానాటికీ పెరుగుతోంది కూడా పెద్ద నగరాల్లో ఇప్పటికే భారీ చిల్లర గొలుసు వ్యాపారాలు ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఎన్నో దుకాణ సముదాయాలొచ్చాయి. అదే సమయంలో గత కొన్నేళ్లలో చిన్న వ్యాపారాలు మూడు రెట్లు పెరిగిన విషయాన్ని కూడా మనం చూడొచ్చు, ఎదిగే ఆర్థిక రంగంలో చిన్న, పెద్దా పెరగడానికి అవకాశం ఉంటుంది. చిన్నవ్యాపారులు తుడిచి పెట్టుకుపోతారన్న భయం పూర్తిగా నిరాధారం. విదేశీ పెట్టుబడితో ప్రారంభమయ్యే సంఘటిత చిల్లర వ్యాపారం మన రైతులకు లబ్ధి చేకూరుస్తుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. అందుకు తగ్గట్టు మనం నియంత్రణలు తీసుకురావాలి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తెచ్చేవారు 50 శాతం మొత్తాన్ని గోదాములు, శీతల గిడ్డంగులు, ఆధునిక రవాణా వ్యవస్థలో పెట్టాలి. తగిన మౌలిక వసతులు. రవాణా సౌకర్యాలు లేక వినియోగదారులకు చేరాల్సిన పండ్లు, కూరగాయల్లో మూడో వంతు వృథా అవుతున్నాయి. ఎఫ్‌డీఐ లోస్తే వృథా తగ్గుతుంది. రైతులకు లాభాలు పెరుగుతాయి. వినియోగదారులు చెల్లించే ధరలు తగ్గుతాయి. సంఘటిత చిల్లర రంగు లక్షలాది నాణ్యమైన ఉద్యోగాలు సృష్టిస్తుంది.

### వద్దనుకుంటున్న రాష్ట్రాల ఇష్టం

కొన్ని రాజకీయ పార్టీలు ఈ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్న విషయాన్ని మనం గుర్తించాం. అందువల్ల ఈ నిర్ణయాధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలిపెట్టాం. ఆ రాష్ట్రాలకు ఎఫ్‌డీఐ రావాలో వద్దో అనే నిర్ణయించుకుంటాయి. రైతులు, యువకులు, వినియోగదారులకు మంచి జీవనం కల్పించాలని అనుకుంటున్న ఒక రాష్ట్రాన్ని మరొక రాష్ట్రం అడ్డుకోవాలి.

1992లో తయారీ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతించినప్పుడు చాలా మంది ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోజు భారతీయ కంపెనీలు, ఇంటా, బయట పోటీని సమర్థంగా ఎదుర్కొంటున్నాయి. అవి ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడి పెడుతున్నారు. మరీ ముఖ్యమేమంటే, విదేశీ కంపెనీలు ఐటీ,స్టీల్, ఆటో రంగంలో దేశీయ యువతకు ఉద్యోగాలు కల్పించాయి. చిల్లర వర్తకంలోనూ అదే జరుగుతుందని నేను నమ్ముతున్నా.

యూపీయే ప్రభుత్వ సామాన్యుడి ప్రభుత్వం. గత ఎనిమిదేళ్లలో యేటా 8.2 శాతం వృద్ధితో ఆర్థిక వ్యవస్థ ఎదిగింది. పేదరికం వేగంగా తగ్గుముఖం పట్టేలా చూశాం. వ్యవసాయరంగం వేగంగా వృద్ధి చెందింది. గ్రామీణ తలసరి వినియోగం కూడా వేగంగా పెరిగింది.

### విపక్షాల తప్పుడు ప్రచారంతో మోసపోవద్దు

మనం ఇంకా చాలా చేయాల్సి ఉంది. సమీకృతాభివృద్ధి లక్ష్యాన్ని చేరాలంటే మనకు మరింత వృద్ధి కావాలి. మన ఆర్థిక వ్యవస్థపై నమ్మకాన్ని పోగొట్టే ద్రవ్యలోటును కచ్చితంగా నివారించాలి. దేశాన్ని గరిష్ఠ, సమీకృతాభివృద్ధి సాధన బాటలోకి మళ్లించడానికి అవసరమైన ప్రతిదీ చేస్తానని మీకు వాగ్దానం చేస్తున్నా. అయితే మీ మద్దత్తు కావాలి. భయంగొల్పే, తప్పుడు సమాచారాన్ని వెదజల్లి అయోమయానికి గురి చేయాలని చూస్తున్న వారి మాటలు నమ్మి మోసపోవద్దు. 1991లో కూడా ఇలాంటి ఎత్తులే వేశారు. కానీ వారు విజయవంతం కాలేకపోయారు. ఇప్పుడు కూడా నెగ్గలేరు. దేశప్రజల విజ్ఞతపై నాకు పూర్తి నమ్మకం ఉంది.

### నన్ను అర్థం చేసుకోండి

దేశ ప్రయోజనాలను రక్షించుకోవడానికి మనం చేయాల్సింది. చాలా ఉంది. అది ఇప్పుడే చేయాలి. కొన్నిసార్లు మనం సులభమైన మార్గాలకు 'నో' చెప్పి సంక్లిష్టమైన వాటికి 'ఎస్' చెప్పాల్సి ఉంటుంది. అది అలాంటి ఒక సందర్భమే. కఠోర నిర్ణయాలకు సమయం వచ్చింది. దీనికి మీ విశ్వాసం. సహకారం, అర్థం చేసుకొనే తత్వం కావాలి.

దేశంలోని ప్రతి ఒక్కరూ నా చేతులను బలోపేతం చేయాలని ఈ సమున్నత దేశ ప్రధానమంత్రిగా పిలుపునిస్తున్నా, అప్పుడు మనం మన దేశాన్ని బంగారు బాటలో నడపడానికి వీలవుతుంది. మన భవిష్యత్తుతో పాటు భావితరాల భవిష్యత్తు కోసం ఉత్తమదేశ నిర్మాణం సాధ్యమవుతుంది. అన్నారు. ■

## బాలారిష్టలు దాటని మీ సేవ

# కష్టంగా, ఆలస్యంగా

- బండారు రామ్మోహన్‌రావు

ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవల్ని, సర్టిఫికెట్లని అంతర్జాలం (ఇంటర్నెట్) లో పెట్టి సులభంగా, వేగంగా సేవలు అందించాలనే లక్ష్యంతో మీ సేవాకేంద్రాలు మొదలై అప్పుడే ఆరు నెలలు అయింది. నల్లగొండ జిల్లా యాదగిరి గుట్టలో రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి దీన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. ఆ జిల్లాతో పాటు మెదక్, అనంతపురం, కర్నూలు, గుంటూరు జిల్లాలలో మీ సేవాకేంద్రాల పనితీరు అవి ప్రజలకు అందిస్తున్న సేవలు ఎలా వున్నాయో తెలుసుకోవడానికి ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఆధ్వర్యంలో ఒక సర్వేని నిర్వహించారు. ఆ సర్వేలో తేలిన అంశాలను ఇక్కడ పొందుపరుస్తున్నాం.

రెవిన్యూ కార్యాలయంలో భూమి రికార్డులు, పహాని, అడంగల్, మ్యూటేషన్ కావాలన్నా, కులము, ఆదాయము, నివాసధృవీకరణ పత్రం పొందాలన్నా ఇక ఆలస్యం వుండదని లంచాలు అసలే వుండవని క్షణాల్లో పని సులువుగా అవుతుందని మీ సేవా కేంద్రాల పట్ల అరచేతిలో స్వర్గం చూపెట్టారు. కాని వాస్తవంగా సులభంగా, వేగంగా పొందాల్సిన సేవలు కష్టంగా, ఆలస్యంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. గతంలో సరాసరి ఆఫీసులకి వెళ్ళి అధికారులు విధించిన పరీక్షలన్నీ తట్టుకుని కనీసం లంచమైనా ఇచ్చి పని చేసుకునేవారమని కాని ఇప్పుడు అన్ని సేవలు మీ సేవా కేంద్రాల ద్వారానే తీసుకోవాలని నిబంధనలతో లంచమిచ్చినా కూడా సకాలంలో పనులు కావడంలేదు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో, కర్నూలు జిల్లా నంద్యాల, గుంటూరు జిల్లా చిలకలూరిపేటలలో మీ సేవాకేంద్రాలు ప్రారంభించి ఆరు నెలలైనా అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం జతచేయకపోవడంతో అక్కడ ఏ సేవలు అందడం లేదు. అలాగే మెదక్ జిల్లా సిద్ధిపేట, సంగారెడ్డిలలో కొన్ని రెవిన్యూ సేవల్ని ఆన్‌లైన్‌లో పెట్టడం వల్ల పహాని అడంగల్‌ని 15 నిముషాలలోగానే తీసుకోగలుగుతున్నారు. కులము, ఆదాయము, నివాసధృవీకరణ పత్రాలకి నెలల తరబడి వేచి వుండాల్సిన గతి పడుతుంది. భారతపౌరుడు ఎవరైనా పేరు, మతాన్ని మార్చుకోవచ్చు. కాని కులాన్ని మార్చుకోడానికి వీల్లేదు. అలా మారని కులం ధృవీకరణ పత్రం కావాలంటే మళ్ళీ జన్మ ఎత్తాల్సిందే. అలాగే ఆదాయ ధృవీకరణ, స్థానిక ధృవీకరణ పత్రం విచారణకి కూడా నెలల తరబడి వేచి చూడాల్సిన దుర్గతిపట్టింది.

మీ సేవా కేంద్రాల ప్రారంభానికి ముందు రెవిన్యూ కార్యాలయానికి వెళ్ళి ఒక దరఖాస్తు పెట్టుకుని లంచం సమర్పించుకుంటే గంటల్లో పని జరిగేది. కాని ఇప్పుడు మీ సేవా కేంద్రానికి వెళ్ళి ఒక దరఖాస్తు చేయాలంటే ఎంత కష్టపడాలో నల్లగొండ జిల్లా భువనగిరి మీ సేవ కేంద్రంలో ఒక గంట పరిశీలిస్తే తెలుస్తుంది. అక్కడ టేబుల్ మీద విసిరేసిన కాగితాల కట్టల్లో ఇరవై, ముప్పై మంది ఆత్రంగా వెతుక్కుంటుంటారు. తాము నెలకింద పెట్టిన దరఖాస్తుకి రశీదును ఆ రోజు వాళ్ళు చూసుకుంటారు. ఆ రశీదు ఇస్తేనే సేవ అందుతుంది. లేకపోతే అంతే సంగతి. ఇక అక్కడ వున్న రెండు కౌంటర్లలో ఏదో ఒక కౌంటరనుకుని మనం క్యూలో నిలబడితే మనవంతు వచ్చాక ఇక్కడ కాదు అక్కడ అంటూ తాపీగా సెలవిస్తారు. మళ్ళీ ఆ కౌంటర్లో మొదటినించి క్యూలో నిలబడాలి. ఇదేమని నిర్వాహకులను ప్రశ్నిస్తే భువనగిరి పట్టణమే కాదు చుట్టుపక్కల మండలాల నుండి అందరూ ఇక్కడికే వస్తే రోజుకి మూడొందల దరఖాస్తులు తీసుకోవాల్సి వస్తే మేం ఏం చేసేది అంటున్నారు. ముఖ్యమంత్రి ప్రారంభించిన యాదగిరి గుట్ట మీ సేవ కేంద్రం కూడా మూణ్ణాళ్ళ ముచ్చటగా మూతపడిపోతే ప్రజలు భువనగిరికి రాక ఇంకెక్కడికి వెళతారు.

### మీ సేవా కేంద్రాల్లో ఏం జరుగుతుంది?

మీ సేవాకేంద్రాల్లో మీరొక సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే దాని విచారణకి సంబంధిత రెవిన్యూ కార్యాలయానికి ఆ దరఖాస్తును ఆన్‌లైన్‌లో పంపుతారు. అక్కడ సంబంధిత ఉద్యోగి దాన్ని చూసి విచారణ చేసి ధృవీకరించుకుని మళ్ళీ మీ సేవాకేంద్రాలకి ఆ విషయాలను చేరవేస్తే అప్పుడు మన

సర్టిఫికెట్ తయారవుతుంది. ఉదా: రెవిన్యూ కార్యాలయంలో కులం సర్టిఫికెట్ పొందడానికి సిటిజన్ ఛార్టర్ ప్రకారం ఏడు రోజులు గడువు వుంటే మీ సేవా కేంద్రం ద్వారా అందుకోవాలంటే ఒక్కోసారి నెల దాటుతుంది. రెవిన్యూ కార్యాలయంలో పెట్టిన సిటిజన్స్ ఛార్టర్లకి మీ సేవా కేంద్రంలో పెట్టిన సేవలు అందించే బోర్డుకి చాలా తేడాలున్నాయి.

ఇదంతా ఎందుకని మనం సరాసరి రెవిన్యూ ఆఫీసుకెళ్ళి అక్కడే దరఖాస్తు పెడదామంటే మీ సేవా కేంద్రాలు వచ్చాక మాన్యువల్ సర్టిఫికెట్ ఇచ్చే పద్ధతి పూర్తిగా తొలగించారని అలా ఇస్తే తమకు పై అధికారుల నుండి మెమోలొస్తాయని రెవిన్యూ అధికారులు చెబుతున్నారు. గతంలో ఈ సర్టిఫికెట్లు రెవిన్యూ ఆఫీసులో వుండే అధికారులు వారి కులాన్ని, ఆదాయాన్ని ఇతరత్రా సేవల్ని, దరఖాస్తుదారుణ్ని గుర్తుపట్టి అప్పటికప్పుడే రాసి ఇచ్చేవాడు. కాని ఇప్పుడు పద్ధతి మారింది కనుక విచారణ తర్వాతే ఈ ధృవీకరణ ఇస్తున్నారు. దీంతో రెవిన్యూ ఆఫీసులో వుండే సిటిజన్‌ఛార్టర్లు చిన్నబోతున్నాయి. మీ సేవా కేంద్రాల్లో ప్రజలకు సౌకర్యం కంటే అసౌకర్యమే ఎక్కువ కలుగుతుంది. కేంద్రాలు ప్రారంభించినా సరైన సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేయకపోవడం అన్ని కార్యాలయాల సేవలను, సర్టిఫికెట్‌లను ఆన్‌లైన్‌లో సిద్ధం చేసి వుండకపోవడం. మీ సేవా కేంద్రాల ఏర్పాటు ఒక మంచి నిర్ణయం. కాని వాటి అమలులో సంధికాలం కొనసాగుతుంది కనుక ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేవరకు ఈ కష్టాలు తప్పవని భువనగిరి మీ సేవా కేంద్ర మేనేజర్ తెలిపారు.

**మీ సేవాకేంద్రాల్లో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులు/ పరిష్కారాలు**

1. మీ సేవాకేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడం
2. అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లోని సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఉంచకపోవడం
3. ఆయా కార్యాలయాలకు వచ్చిన దరఖాస్తులను ఫార్వర్డ్ చేసి సమాచారం తిరిగి తెప్పించుకోవడంలో ఆలస్యం.
4. కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సిటిజన్ ఛార్టర్లలో పేర్కొన్న నిర్ణీత గడువుకి, మీ సేవా కేంద్రాల్లో అవే సేవలు అందించటానికి నిర్ణయించిన గడువుకి మధ్యన చాలా అంతరం ఉంది.
5. పెద్ద మున్సిపాలిటీలలో మీ సేవా కేంద్రాలకు వచ్చే ప్రజలకు తగ్గ సిబ్బంది, కంప్యూటర్‌లు లేకపోవడం.
6. విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్‌లలో వేటికవే తీసుకోవాలనడం. ఉదా: నివాస, కుల, ఆదాయ ధృవపత్రాలు వేరు వేరుగా తీసుకోవడం వల్ల వాటికి చెల్లించాల్సిన ఫీజు తడిసి మోపెడవుతుంది. అదే ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ విధానాన్ని ప్రవేశపెడితే ఒక వ్యక్తికి ఒకే సర్టిఫికెట్‌లో పై వివరాలన్నీ నమోదు చేయవచ్చు. దీనివల్ల ఆ విద్యార్థి గుర్తింపు సంఖ్యను ఆన్‌లైన్‌లో వుంచడం ద్వారా విద్యార్థి ఎక్కడైనా ఈ సేవను పొందే అవకాశం ఉంటుంది.
7. వ్యవసాయదారులకు, రైతులకు తమ భూములకు సంబంధించి అడంగల్, పహాని కోసం దరఖాస్తు చేస్తే ఆ రైతుకు వున్న అన్ని భూముల వివరాలని ఒకే కాగితంపై రాసి ఇచ్చేవారు. కాని మీ సేవా కేంద్రాల్లో ఆ భూమి కమతం చిన్నదైనా, పెద్దదైనా ప్రతి సర్వే నంబరుకి ఒక ధృవీకరణ తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ప్రతి సర్టిఫికెట్‌కి వేరు వేరుగా రుసుములు చెల్లించాల్సి ఉంటుంది.
8. గతంలో రెవిన్యూ కార్యాలయాలకి సరాసరిగా వెళ్ళి దరఖాస్తు చేస్తే చాలాసార్లు అప్పటికప్పుడే పని పూర్తయ్యేది. కాని ఇప్పుడు మీ సేవా కేంద్రాలతో అనుసంధానం చేయడం వల్ల వీలు కావడం లేదు.

ఈ విషయంలో భువనగిరిలో ప్రజలు, పౌరసమాజం నుంచి అభిప్రాయాల సేకరణ చేయగా పై లోపాలు వారు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మీ సేవాకేంద్రాల నిర్వహణలో మెళకువలు పాటించి ప్రజలకు సత్వర సేవలు అందించాలని వారు కోరారు. ప్రతి మండలానికి ఒక మీ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడ అన్ని ప్రభుత్వ కార్యాలయాలలోని సేవలు, సర్టిఫికెట్లు సులభంగా, వేగంగా అందించే ఏర్పాటు చేయాలని కోరారు. ఎఫ్‌డిఆర్ నిర్వహించిన ఈ సర్వేలో సంగారెడ్డి నుండి పటోళ్ళ మాధవరెడ్డి, శ్రీధర్ సిద్ధిపేట నుండి తుమ్మనపల్లి శ్రీనివాస్, కొర్తివాడ రాజేందర్, నంద్యాల నుండి ఎస్.ఎ మాజీద్, రాయదుర్గం నుండి వెంకటరమణబాబు, చిలకలూరిపేట నుండి భానుప్రసాద్ పాల్గొన్నారు. ఎఫ్‌డిఆర్ కేంద్రం తరఫున నల్గొండ జిల్లా భువనగిరికి బండారు రామ్మోహన్‌రావు, వెంకటేష్, అభిషేక్‌తోపాటు కాచరాజు జయప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు. ■

# ఆగ్ ఆగ్ ఆగ్ ఆగ్

ప్రపంచ వనరుల భాండాగారం
పెనుముప్పున పడిపోతోందేమ్
సమిష్టి యత్నపు స్వతంత్ర్యదేశం
సుస్వరాల గళమెత్తదదేమ్

ఏలుబడికి చిరునామాఐన
వూరు బడి కళ తప్పిందేమ్
రత్నగర్భ రతనాల సీమ
రక్తపుటేరుల నెలవైనదదేమ్

జననీ జన్మ భూమంటూనే
నమ్మకద్రోహం చేస్తారేమ్
ఇసుక, ఇనుము, బొగ్గు, నీరు
రొమ్ము చీల్చి దోచేస్తారదేమ్

పేదల రక్తం చేసిన కష్టం
చీపు లిక్కరుగా మారిందేమ్
పేద ధనిక వ్యత్యాసాలను
పెంచే మంత్రమయ్యిందేమ్

రాజ్యాంగం అని రాసుకున్న
మన హక్కుల బాధ్యత మరిచామేం
వికలత్వంతో ఎదగనిచ్చి
అదే అభివృద్ధి అంటారదేమ్

ఇప్పుడుకాక ఇంకెప్పుడంటూ
నేనుకాక ఇంకెవ్వరంటూ
ప్రమాద ఘంటిక మ్రోగిస్తూ
సురాజ్య ఉద్యమ మొచ్చిందోయ్

స్వరాజ్య హాలికుల సురాజ్య ఫలాలు
ప్రతి పౌరునికి చేరాలోయ్
జాతి సంపదగ యువతను పెంచి
భావి తరాలకందిన్చాలోయ్.

**వందేమాతరం..... వినూత్నశ్రుతి**

# సంప్రదాయ రాజకీయం

పసిపాపల నెత్తుకుంటారు బుగ్గలు గిల్లుతారు
ముద్దులు కురిపిస్తారు ముచ్చట్లాడుతారు
ఎన్నికల ముందు కన్పించే నాటకాల రాయుళ్ళు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

సాగునీరు, త్రాగునీరందిస్తామంటూ
మైకుల్లో వైకుంఠం చూపిస్తారు
ఎన్నికల ముందు కన్పించే మంచి మాటకారులు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

కులం, మతం లెక్కల కూడికలు వేస్తారు
ఆ కూడికలు లాభం కోసం కారుకూతలు కూస్తారు
ఎన్నికల ముందు కన్పించే కుల పిచ్చిగాళ్ల వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

కరువు కాటకాలొచ్చినా కన్పించని వారు
ఎన్నికలొచ్చాయంటే యింటికొచ్చి యోగక్షేమాలడుగుతారు
ఎన్నికల ముందు కన్పించే స్వార్థజనులు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

ఎన్నికలలో ఎంతైనా ఖర్చు పెడతారు
గెలుపే ధ్యేయంగా వ్యూహం రచిస్తారు
ఎన్నికల ఖర్చును పెట్టుబడిగా భావించే వ్యాపారులు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

ఎన్నికల ముందు యింటికొచ్చి ఆప్యాయంగా పలుకరిస్తారు
ఎన్నికలనంతరం నీవు ఎవరోనన్నట్లు ప్రవర్తిస్తారు
రాజకీయ నాటకంలో రాటుదేలిన నటకిరిటీలు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

ఎటువంటి టెండర్లైనా తనవారికే కావాలంటారు
ఇరువదిపైసలు ఖర్చుపెట్టి ఎనభైపైసలు ఆనాలంటారు
దేశాభివృద్ధి ద్రోహం చేస్తున్న దేశద్రోహులు వీరు
వీరే.. వీరే... సంప్రదాయ రాజకీయ నేతలు

- నంద్యాల రామకృష్ణరాజు
7842344828

# కొలువులకి పనిమంతులు రావట్లేదు

- **జయదేవ్ గల్లా,** అమరరాజా బ్యాటరీస్ మేనేజింగ్ డైరెక్టర్

- మన దగ్గర కొత్తగా ఉద్యోగాల్లోకి తీసుకున్న ఇంజినీరింగ్ విద్యార్థులకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. ఇతర దేశాల్లో ఇలా లేదు. దీనికి ముఖ్యకారణం అక్కడి విద్యా విధానమే. కార్పొరేట్ కంపెనీల్లో శిక్షణ తీసుకున్న వారు స్థిరంగా ఉండడంలేదు. తద్వారా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అనుభవ రాహిత్యంతో అభ్యర్థులూ నష్టపోతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం విశ్వ విద్యాలయాలు, కళాశాలల చేతుల్లోనే ఉంది.
- విద్యాభ్యాస సమయంలో ఎంతో ముఖ్యమైన ప్రాక్టికల్ చదువులకు మన విద్యార్థులు దూరంగా ఉంటున్నారు. కొంతవరకు డీఆర్‌డీవో, ఇస్రో వంటి సంస్థల్లోనే పరిశోధనలు జరుగుతున్నాయి. వాస్తవానికి పరిశోధనలు తీవ్రస్థాయిలో జరగాల్సింది విద్యా సంస్థల్లోనే. దీనివల్ల ఆయా పరిశ్రమల నిర్వాహకులు సొంతంగా పరిశోధనలు ప్రారంభిస్తున్నారు. విద్యార్థులకు అవకాశాలు మరుగున పడిపోతున్నాయి.
- విదేశాల్లో డిగ్రీస్థాయి విద్యార్థులు ఖాళీ సమయంలో వేసవి సెలవుల్లో అప్రెంటిషిప్ చేస్తుంటారు. తద్వారా అనుభవాన్ని పొందుతారు. ఆ అలవాటే మన విద్యార్థులకు లేదు. అమెరికాలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే విద్యార్థికి జనరల్ స్టడీస్ తప్పనిసరిగా ఉంటుంది. వారికి ప్రాక్టికల్ చదువులు, పరిశోధ నాత్మక పాఠ్యాంశాలు ఎక్కువే. అన్ని కోణాల నుంచి విద్యార్థి ప్రతిభను వెలికితీసేలా చేయాలంటే చదువుతున్న అంశంపైనే కాకుండా ఇతరత్రా వాటిపైనా కనీస అవగాహన ఉండేలా పాఠ్యాంశాలను మార్చుకోవాలి.
- మన దగ్గర ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయి. 2022 నాటికి అదనంగా 15 మిలియన్ ఉద్యోగాలు కల్పించాలనే భారీ లక్ష్యాన్ని భారత పరిశ్రమల సమాఖ్య ఓ విజన్‌గా పెట్టుకుంది. ప్రస్తుతం అమలవుతున్న విద్యావిధానమే కొనసాగితే ఈ లక్ష్యం నెరవేరడం కష్టం. నైపుణ్యాభివృద్ధి అనేది చాలా ముఖ్యం. నైపుణ్యం పెరిగితేనే అనుకున్న లక్ష్యాల్ని సాధించేందుకు వీలుంటుంది. 15 మిలియన్ ఉద్యోగాల కల్పనపై ప్రభుత్వానికి నివేదికలను, తగిన ప్రణాళికలతో అందించాం. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తుంటే. సరైన నైపుణ్యం కలిగిన అభ్యర్థులే కరవయ్యారు. లక్షన్నర మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పట్టాలతో ఏటా బయటకొస్తున్నా ఉద్యోగావకాశాలు పొందుతున్న వారి సంఖ్య 25% లోపే ఉంటోంది. అసోచామ్, నాస్కామ్ వంటి సంస్థల నివేదికలు సైతం విద్యా ప్రమాణాల దిగజారుడుతనాన్ని స్పష్టంచేస్తున్నాయి.
- ఇంజినీరింగ్ విద్యలో ఏ కోర్సులో చదివినా విద్యార్థులకు భవిష్యత్తు తప్పకుండా ఉంది. ఎందుకంటే.. పరిమిత సంఖ్యలోని సంస్థలు మాత్రమే విద్యార్థుల ఎంపికలో కోర్సులకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. మా సంస్థ (అమరరాజా బ్యాటరీస్) ఎలక్ట్రిక్ రంగంలో ఉన్నా.. మేము అన్ని కోర్సుల వారిని తీసుకుంటున్నాం. అన్ని కోర్సుల వారి అవసరాలు పరిశ్రమలకు ఉన్నాయి. దీనివల్ల ఫలానా కోర్సులో చేరితేనే... భవిష్యత్తు ఉంటుందని, ఉద్యోగావకాశాలు ఉంటాయన్న అభిప్రాయాల నుంచి విద్యార్థులు బయటకు రావాలి.
- మన దేశంలో 70 శాతం మంది గ్రామీణ ప్రాంత వాసులే. వీరికి భావవ్యక్తీకరణ పట్టణ ప్రాంత వాసులతో పోలిస్తే చాలా తక్కువ. కానీ పట్టణయువత కంటే గ్రామీణ యువతలోనే నాయకత్వ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. వీరికి చిన్న వయస్సు నుంచే కష్టపడడం అలవడుతోంది. ఇలాంటి వారికి తగిన తర్ఫీదును ఇస్తే మంచి ఫలితాలు కనిపిస్తాయి. అందుకనే.. మా పరిశ్రమల తరపున ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని త్వరలో ప్రారంభించనున్నాం.
- యువతలో చాలా మంది అవకాశాలు కల్పించినా పరిచేయలేక వెనుదిరిగిపోతుండడం క్రమేపీ ఎక్కువవుతోంది. పని కల్పిస్తే... అందులో ఇమడలేక కొంత కాలానికే బయటకొచ్చేస్తున్నారు. ఇందుకు కారణాలను పరిశీలించినప్పుడు... ఉద్యోగం వస్తే పరిశ్రమల్లో మనం ఎలా పనిచేయాలన్న దానిపై వారికి అవగాహన లేకపోవడమే. పరిశ్రమలతో పరిచయం లేకుండా చదివితే విద్యార్థులు ఎలానష్టపోతున్నారో ఈ విషయం ద్వారా మరోసారి స్పష్టమవుతోంది. ◆

(ఈనాడు సౌజన్యంతో...)

# కొబ్బరి కార్మికులకు సామాజిక భద్రత







## ఐ.పోలవరం (తూర్పుగోదావరి జిల్లా) :

లోక్‌సత్తా పార్టీ నెరవేర్చగలిగే హామీలు మాత్రమే ఇస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పి.బాలానంద కుమార్ అన్నారు. నియోజకవర్గ కొబ్బరి వలుపు, దింపు కార్మికులతో పాతయిజరంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వలుపు, దింపు కార్మికుల సమస్యలను ఆయా సంఘ కార్మిక నాయకులు సభ దృష్టికి తీసుకొనివచ్చారు. ప్రభుత్వాలు మారుతున్నా, కార్మికుల కోసం మంచి పథకాలు ప్రవేశపెట్టలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వచ్చి వాగ్దానాలు గుప్పించి వెళ్లడమే కాని ఎవ్వరూ పట్టించుకొనే దాఖలాలు లేవని కార్మికులు పేర్కొన్నారు. బాలానంద కుమార్ మాట్లాడుతూ లోక్‌సత్తా అధికారంలోకి వస్తే కుటుంబానికి సామాజిక భద్రతకు ఏర్పాట్లు చేస్తుందని అన్నారు. కార్మికుల పిల్లలకు ఉచిత విద్య, వైద్యం అందించడం చేస్తుందన్నారు. సమావేశంలో అడపా శంకరరావు, ఎన్.కిశోర్‌కుమార్, ఎం.రాజశేఖర్, పలివెల వెంకట్రావు, కముజు సంజీవరావు, గొడా నాగేంద్ర, యలమంచలి శ్రీరాములు పాల్గొన్నారు.

# జేపీ తీరే వేరు



వ్యవస్థలో మార్పునకు తపన పడేవారు ఎలా ఉంటారో లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మల్కాజిగిరిలో తన చర్యల ద్వారా స్థానికులకు తెలియచెప్పారు. ఇక్కడ జరిగిన కార్యక్రమానికి కారులో వస్తున్న ఆయన అరకిలో మీటరు దూరంలోనే ఆగి కారు దిగి నడుచుకుంటూ వస్తూ రోడ్డు పక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకు నే పేతల జీవన పరిస్థితులు ఎలా ఉన్నాయో పరిశీలించారు. వారిని అనేక రకాల ప్రశ్నలు అడిగి వారి పేదరికానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఇక్కడ అమ్మకాల ద్వారా వారికి వచ్చే ఆదాయం తెలుసుకున్నారు. వారి పిల్లల చదువులను గూర్చి ప్రత్యేకంగా తెలుసుకుని చదువును మధ్యలోనే వదిలేసిన వారిని తిరిగి చదువుకోవాలని సూచించారు. పేదరికంతో చదువుకోలేని వారికి అవసరమైన సహాయం అందించాలని కార్యకర్తలకు సూచించాలని కార్యకర్తలకు సూచించారు. సురాజ్య రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించే ఆడిటోరియంకు చేరుకున్న వెంటనే ఆయనకు విద్యార్థులు వరుసగా నిలుచుని గులాబీలతో స్వాగతం పలికారు ఇలాంటివి తనకు నచ్చవని సున్నితంగా నిర్వాహకులకు తెలిపారు పిల్లలను ఎంతసేపటి నుంచి ఇక్కడ నిలబడ్డారని? కాళ్లు నొప్పులు పుడుతున్నాయా? అని వారిని అడిగి తెలుసుకున్నారు. వారి చేతుల్లో గులాబీలను వారికే తిరిగి ప్రేమతో అందించారు. భవిష్యత్ బాగుండాలని ఆయన వారిని ఆశీర్వదించారు. ఇక్కడ సమావేశ మందిరంలో సురాజ్య సమావేశం ఆవశ్యకతను గూర్చి గంటసేపు అనర్గళంగా ప్రసంగించారు. ముఖ్యంగా యువతను ఆయన ఆకట్టుకున్నారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సూటిగా సమాధానమిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార యంత్రాంగంలో రాజకీయాల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా వివరించిన తీరుకు మంచి స్పందన లభించింది. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఆయన ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకించారు. సభ నుంచి తిరిగి వెళ్లే సమయంలో తన వెంట ఎవరూ రావద్దని తనంతట తానే ఇక్కడ నుంచి తిరిగి వెళ్లారు సురాజ్య ఉద్యమానికి తన పర్యటనతో జయప్రకాష్ నారాయణ్ మల్కాజిగిరిలో మంచి పునాది వేశారని ఇక్కడకు వచ్చిన వారు అభిప్రాయపడ్డారు. ■

# నీతివంతమైన పాలన కోసం ఉద్యమం

## రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు



### చీరాలలో రౌండ్‌టేబుల్

అవినీతిలేని పాలన, అందరికీ ఎదిగే అవకాశాలు కల్పించడం కోసం చేపడుతున్న సురాజ్య ఉద్యమానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతునివ్వాలని విశ్రాంత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు పిలుపునిచ్చారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సాయికృష్ణ రెసిడెన్సీలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాధవరావు మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు డబ్బు, కులం, మతం వంటి అంశాలతో నిమిత్తం లేకుండా మంచి ప్రమాణాలతో విద్య ఉన్నత అవకాశాలు కల్పించాలన్నారు. స్థానిక సంస్థలకు అధికారాలు ఉండాలని తెలిపారు. సమాజంలో అన్ని స్థాయిలలో పేరుకుపోయిన అవినీతి తొలగాలంటే ప్రజలు చైతన్యవంతులై పోరాడాలన్నారు. దామాషా పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికల్లో ప్రలోభాలను నిరోధించవచ్చునని చెప్పారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు అల్లు శివరవేష్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతిని నిర్మూలించి అందరికి సమానావకాశాలు కల్పించేందుకే లోక్‌సత్తా పోరాడుతుందని చెప్పారు. సమావేశానికి దాసరి ఇమ్మానియేల్ సమన్వయకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో జి.గంగాధరరావు, కాకరపర్తి వెంకటేశ్వర్లు, సురేష్, యాతం ఆనందరావు, యడం రవి, జయరామిరెడ్డి, రత్నకుమార్, బెజ్జం విజయకుమార్, టీ.లక్ష్మీప్రసాద్, జయపాల్, గూడూరి శివరామప్రసాద్, కట్టా కృపావర్ధన్, ఎన్.ప్రభుదాసు, వెంకటేశ్వరు, ఊటూకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలన ప్రజల హక్కు

## సురాజ్య ఉద్యమ కన్వీనర్ డా॥ జయప్రకాష్ నారాయణ్



### మల్కాజ్‌గిరిలో రౌండ్‌టేబుల్

సుపరిపాలన పౌరుల హక్కు అని లోక్‌సత్తా అధినేత, ఎమ్మెల్యే జయప్రకాష్‌నారాయణ్ అన్నారు. మల్కాజిగిరి ఈస్టు ఆనంద్‌బాగ్‌లోని గజానన ఫంక్షన్ హాలులో మాల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దిలీప్ శంకరరెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన ప్రజల లేవనెత్తిన పలుఅంశాల పై విపులంగా చర్చించి తగిన సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రతి ఒక్కరు లోక్‌సత్తా సురాజ్య ఉద్యమంలో భాగస్వాములు కావాని ఆయన కోరారు. ఎఫ్.డి.ఐ.లతో దళారి వ్యవస్థ రూపుమాసి పోవడమే కాక రైతులకు, వినియోగదారులకు ఇరువురికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

# సుపరిపాలన కోసమే సురాజ్య ఉద్యమం

## మాజీ ఎంపీ సోలిపేట రామచంద్రారెడ్డి

దేశంలో అవినీతికి తావులేని సుపరిపాలన కోసం సురాజ్య ఉద్యమం ప్రారంభించామని ఉద్యమ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు డి.వి.వి.యస్.వర్మ అన్నారు. స్థానిక ఎన్.జి.ఒ.హోంలో సురాజ్య ఉద్యమం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఇప్పటికి రాష్ట్రంలో 40 పట్టణాల్లో సమావేశాలు నిర్వహించామన్నారు. అక్టోబరు ఆఖరుకు వంద పట్టణాల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమంగా రూపుదాల్చేందుకు అన్ని వర్గాల సహకారం లభిస్తుందన్నారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎన్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 73,74 రాజ్యాంగ సవరణ బిల్లులు రాజీవ్‌గాంధీ హయాంలో ఆమోదం పొందాయని, వీటి స్ఫూర్తితో కేరళ, పశ్చిమ బెంగాల్‌లో 29 అంశాలు స్థానిక సంస్థలకు బదిలీ అయ్యామని తెలిపారు. మన రాష్ట్రంలో పది అంశాలు మాత్రమే బదిలీ అయ్యాయని, అవి కూడా నామమాత్రంగా అమలు జరుగుతున్నాయని చెప్పారు. డి.ఆర్.డి.ఎ. అనేది ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేదని, జిల్లా పరిషత్‌లో దీనిని విలీనం చేశారన్నారు. పంచాయతీలు, మండలాలు, జిల్లా పరిషత్‌లు తొలగించి గ్రామ, మండల, జిల్లా ప్రభుత్వాలు మార్చాలని సూచించారు. ప్రజాస్వామ్య




### నరసరావుపేటలో రౌండ్‌టేబుల్

వ్యవస్థల్లో పెను మార్పుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ, కీలక సన్నాహక కమిటీ కన్వీనర్ నిర్మలా బోసు, బి.జె.పి. నాయకులు రాము, రంగస్థల అధ్యక్షులు వెంకట్రావు, ఇ.ఎం.స్వామి, అశోక్‌బాబు, కోటిరెడ్డి, మాజేటి వెంకటేష్, కొల్లి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు. పట్టణ సురాజ్య ఉద్యమ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షులుగా నిర్మలాబోసు, కన్వీనర్‌గా ఎన్.గోవిందరావు, కోశాధికారిగా చలమయ్య, సభ్యులుగా ప్రసన్నకుమార్, కనకరత్నం, సుబ్బారెడ్డి, భాషా ఎన్నికయ్యారు.

# సురాజ్య సాధన కోసం విద్యార్థులు ప్రతిజ్ఞ

సురాజ్య సాధనకోసం సాగిస్తున్న మరో స్వతంత్ర పోరాటంలో పాల్గొంటామని, అవినీతిని అంతం చేయడం కోసం కృషిచేస్తామని ఎనిమిది కళాశాలలకు చెందిన 6,500 మంది విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యులు మూడు బృందాలుగా పట్టణంలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల, శారద, వాసవీ, ఎడ్యుకేర్ జూనియర్ కళాశాలలు, విక్టరీ డిగ్రీ కళాశాల, భావనా అకాడమీ, స్వామి పాఠశాలలను సందర్శించి అవగాహన కల్పించి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కమిటీకి నూతనంగా ఎన్నికైన నాతాని శ్రీనివాస్, ఘంటా నిర్మలాబోస్, కోశాధికారి దాయల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏంజిల్ టాకీస్ సెంటర్‌లో ఉదయం 9 గంటల నుండి జరిగే సురాజ్య ఉద్యమంలో విద్యార్థులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ నాతాని వెంకటేశ్వర్లు, మద్దుల నరేష్, శ్రీనివాసరెడ్డి, ఎస్ఎం షరీఫ్, నాసరయ్య, ఎలూరి ప్రసాదరావు, గురవయ్య, ఈదర గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.

# సుపరిపాలనకు సురాజ్య ఉద్యమం

## రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు

సుపరిపాలన కోసం సురాజ్యఉద్యమం ప్రారంభించినట్లు విశ్రాంత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు అన్నారు. చిలకలూరిపేట నన్నపనేని వెంకటరత్నం కల్యాణమండపంలో లోక్‌సత్తా ప్రజాస్వామ్య సంస్కరణ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖుల బృందంతో జరిగిన సురాజ్య ఉద్యమ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం ప్రస్తుతం కీలక సంక్షోభ దశలో ఉందన్నారు. పౌరులమైన అందరం స్వాతంత్ర్య ఫలాలను పూర్తిస్థాయిలో అందుకోలేని పరిస్థితిలో ఉన్నామన్నారు. నాడు స్వపరిపాలన కోసం స్వరాజ్య ఉద్యమం జరిగితే నేడు సుపరిపాలన కోసం సురాజ్య ఉద్యమం జరగాల్సిన అవశ్యకతను మాధవరావు వివరించారు.



### చిలకలూరిపేటలో రౌండ్‌టేబుల్

### అన్ని సదుపాయాలు కల్పించడమే

సురాజ్య ఉద్యమ రాష్ట్ర నాయకులు డి.వి.వి.యస్.వర్మ మాట్లాడుతూ సురాజ్యం అంటే అందరికి ఒకే స్థాయిలో అన్ని సదుపాయాలు కల్పించడమేనన్నారు. ఉన్నవాళ్ల పిల్లలకి, లేని వాళ్ల పిల్లలకి ఒకే తరహా చదువు, ప్రజలందరికీ ఒకే తరహా వైద్యసేవలు, యువతకు ఉపాధినిచ్చే నైపుణ్యాలు, రైతులకు లాభసాటి వ్యవసాయం, పేదలకు జీవనభద్రత, అందరికీ గృహ వసతి, సురక్షిత నీరు, మరుగుదొడ్లు, కోతలు లేని విద్యుత్తు అందించడమేన్నారు. ప్రస్తుత ఎన్నికల విధానం లోపభూయిష్టంగా మారిందన్నారు. రాజ్యసభ మాజీ సభ్యులు సోలిపేట రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు బలమైన అవినీతి నిరోధక, జవాబుదారీ వ్యవస్థను ఏర్పాటు చేయడం సురాజ్య ఉద్యమంలో భాగమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు, డాక్టర్ జంపని వెంకట్రాయుడు లంకా ఆదినారాయణరెడ్డి, మిరియాల రత్నకుమారి, పోపూరి సుబ్బారావు, బొల్లు శంకరరావు, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు రామ్మూర్తి, నియోజకవర్గ కన్వీనర్ మాదాసు భానుప్రసాద్, పద్మారాణి, దుర్గాదేవి, తదితరులు సురాజ్య ఉద్యమంలో భాగంగా పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు మురికపూడి ప్రసాద్, అబ్దుల్‌జబ్బార్, సాధిక్, చంద్రమౌళి, వీరాంజనేయులు, నాగరాజు, ఖాధర్, కామినేని, అంజనేయులు, వెంకట్రావు, కమల్ పాల్గొన్నారు.

## పత్తికొండలో సురాజ్య ఉద్యమ కమిటీ

అవినీతి అంతానికి లోక్‌సత్తా ఏర్పాటు చేసిన సురాజ్య ఉద్యమం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ కన్వీనర్ ఆనందాచారి తెలిపారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా యుటిఎఫ్ హనుమంతనాయుడు, గౌరవ సలహాదారుడు టిడిపి ఎస్సి సెల్ జిల్లా నాయకులు తిరుపాలు, ఎస్‌టియు నాయకులు రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా ఎంబర్స్ అధ్యక్షులు ఎం.అశోక్ కుమార్‌లతో పాటు సుభాష్‌చంద్ర, అడ్వకేట్ వీరన్న, బాషా, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రసాద్, శ్రీనివాసులు, మాధవరెడ్డి, రామ్మోహన్, రాము, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఓటుకు నోటు సంస్కృతి మారాలి

## ఎన్.ఎ.పి.యమ్. నాయకులు రామకృష్ణంరాజు

అవినీతి మూలాలు రాజకీయాల్లో ఉంటున్నాయని, ఓటుకు నోటు, మద్యం ఇచ్చే సంస్కృతి మారాలని రాష్ట్ర సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యులు రామకృష్ణంరాజు అన్నారు. ధర్మవరంలో సురాజ్య ఉద్యమంపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఓంకార్, బసవంత్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, జగ్జీవన్, మధనరామాంజనేయులు, చింతాశీన, వెంకటేశులు, చలపతి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శామ్యూల్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మీ పాల్గొన్నారు. సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ సురాజ్య ఉద్యమాన్ని పార్టీలకతీతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలని అధినేత జయప్రకాష్ నారాయణ్ ప్రవేశపెట్టారన్నారు. దేశంలో అవినీతి రహిత సమాజనిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ



ధర్మవరంలో రౌండ్‌టేబుల్

ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షులు కుంచపు లక్ష్మీనారాయణ, పుట్టపర్తి నాయకులు రెడ్డప్ప, రమేష్ పాల్గొన్నారు.

# మెరుగైన సమాజం కోసం ఉద్యమం

## లోక్‌సత్తా రాష్ట్ర మాజీ కార్యదర్శి బండారి అంకయ్య

స్వరాజ్యం కాస్త అవినీతి పాలకులు, అధికారుల పుణ్యమా అని స్వాహరాజ్యంగా మారిందని, పిల్లల బంగారు భవిష్యత్ కోసం దాన్ని సురాజ్యంగా మార్చేందుకు ప్రజలందరు కలిసిరావాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. లోక్‌సత్తా రాష్ట్ర మాజీ కార్యదర్శి బండారి అంకయ్య మాట్లాడుతూ పార్టీల్లో ప్రజాస్వామ్యంగా అదృశ్యమై, కుటుంబవ్యవస్థలుగా మారాయని, నోటుకు ఓటును అమ్ముకుంటే దేశం ఇంకా నాశనమవుతుందని అన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్.శ్రీనివాస్, రాజమౌళి మాట్లాడుతూ అవినీతిపరుల ఆస్తుల్ని జప్తు చేస్తే దేశంలో లోటు బడ్జెట్, నిరుద్యోగం ఉండదని అన్నారు. పాలనా సంస్కరణలకు, పౌర సేవల్ని ప్రాథమిక హక్కుగా గుర్తించాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో నిజాయితీగా పనిచేస్తున్న ఉద్యోగుల్ని సన్మానించాలని సూచించారు. జిల్లాలోని అన్ని కళాశాలల్లో చైతన్య సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్ర కమిటీ



కరీంనగర్‌లో రౌండ్‌టేబుల్

సభ్యుడు బెల్లి రాజయ్య జిల్లా ఉపాధ్యక్షుడు పందిల్ల శంకర్ మాట్లాడుతూ ఈ సదస్సులో బాధ్యులు గంగారావు, చంద్రప్రకాభాకర్, అంజన్‌రావు, శ్రీహరి అంజయ్య జయంత్, పురుషోత్తం, వెంకటేశ్వర్‌రావు, ముజఫర్, రామచంద్రారెడ్డి, లక్ష్మణ్‌కుమార్, మునీర్, 50 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత పాలనే సురాజ్య లక్ష్యం

## లోక్‌సత్తా నాయకులు వైడీ రామారావు

అవినీతి రహిత పాలన కోసం లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమమే సురాజ్యమని లోక్‌సత్తా ఉపాధ్యక్షులు వైడీ రామారావు అన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం ఆగస్టు 9 నుంచి అంతర్జాతీయ దినోత్సవం డిశంబరు 9 వరకు తలపెట్టిన సురాజ్య ఉద్యమ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం లో మాట్లాడారు.



తణుకులో రౌండ్‌టేబుల్

సురాజ్య ఉద్యమ రౌండ్‌టేబుల్‌లో విద్యావేత్తలు, వైద్యులు, ప్రముఖులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు తమ సూచనలు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు చిట్టూరి వెంకటేశ్వర్‌రావు, లయన్స్ క్లబ్ కార్యదర్శి గోకరాజు సత్యనారాయణ, డా॥ వెంకటరాజు, డా॥ హుస్సెన్, డా॥ వసుంధర, డా॥ రమేష్, డా॥ ఆనంద్, ప్రముఖ రచయిత రసరాజు, కృష్ణమూర్తి, ప్రొ॥ కుమారస్వామి, నాదెండ్ల రామకృష్ణ, ఐఎంఎ అధ్యక్ష, కార్యదర్శులు వైద్యులు ఎన్. శ్రీహరి, పి. రామచంద్రరావు, న్యాయవాదులు ఎం. రాజశేఖర్, ఐ.కిరణ్మయి, ఎన్. రామకృష్ణ, వెంకటరత్నం, జిల్లా అధ్యక్షులు గొట్టిముక్కల జానకీ రామరాజు, మాచిరాజు, పట్టణ అధ్యక్షులు వంకా రామదాసు, కన్వీనర్ ఎంఎస్‌కే చైతన్య, కార్యదర్శి కస్తూరి, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు పోలవరపు సత్యనారాయణ, కృష్ణ, ఆదిత్యం, టి.శివశంకర్, కదలి సాయి రాజా, సభ్యులు మల్లిక, దేవి, తోట భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ దినోత్సవంలో సురాజ్యం

## మహిళాసత్తా నేత సరళకుమారి

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ విజయవాడ లోక్‌సత్తాల సంయుక్త ఆధ్వర్యంలో స్వాహారాజ్యం కాదు సురాజ్య నా పౌరహక్కు అన్న నినాదాన్ని ఉపాధ్యాయులుగా జాతిని మీరు ఏ విధంగా జాగృతం చేస్తారన్న అంశంపై ఉపాధ్యాయులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సెప్టెంబర్ 5వ తేదీన స్థానిక ఐడియల్ పబ్లిక్ స్కూల్ డైరక్టర్ వి. సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సభలో దుర్గాతేజ (లయన్స్ క్లబ్) లోక్‌సత్తా మహిళానేతలు పి. సరళకుమారి, వి. శ్రీదేవి, కె. రాధ, కనకవల్లి, పద్మావతి, వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు కె. పద్మావతి, వరలక్ష్మి, సాయుధ, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.




విజయవాడ

# సుపరిపాలన కోసమే సురాజ్య ఉద్యమం

## లోక్‌సత్తా నాయకులు వైడీ రామారావు



ఎందరో త్యాగధనుల కృషి ఫలితంగా మనం సాధించుకున్న స్వరాజ్యం అనతి కాలంలోనే కొందరి స్వాహారాజ్యంగా మారిందని అందువలన సుపరిపాలన కోసమే సురాజ్య ఉద్యమం అనివార్యమైందని స్వరాజ్య ఉద్యమ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు వై.డి.రామారావు అన్నారు. స్థానిక అంబేద్కర్ విజ్ఞాన్ మందిర్‌లో యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు పంచాది రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన యువ రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డబ్బుతో నిమిత్తం లేకుండా పేదలందరికీ నాణ్యమైన వైద్యం, నైపుణ్యంతో యువతను తీర్చిదిద్దుట, రాయితీల బతుకు నుండి రైతులకు రైతులకు లాభసాటి వ్యవసాయంతో అందరికీ ఎదిగే ప్రమాణాలు స్వరాజ్యంతోనే సాధ్యమన్నారు. యువసత్తా రాష్ట్ర అధ్యక్షులు పి.శివాజీ, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు కొత్తకోట పోలినాయుడు, జిల్లా కన్వీనర్ పి.సూర్యారావు, పి.జయచంద్ర, టి.లక్ష్మీపతి, జి.నర్సునాయుడు, ఎం.ప్రవీన్, పి.కృష్ణప్రసాద్, కె.మోహన్‌రావు, పి.రవికుమార్, సిహెచ్.పాపారావు, డి.గిరిబాబు, వి.మురళీ మోహన్, కె.చిన్నంనాయుడు, ఎల్.శాంతారావు, పి.రమణమూర్తి, కోశాధికారి, వి.అప్పరాజు, పెద్ద సంఖ్యలో యువతీ, యువకులు పాల్గొన్నారు.

**శ్రీకాకుళంలో రౌండ్‌టేబుల్**

# అవినీతిలేని పాలనతోనే సుపరిపాలన సాధ్యం




అవినీతి రహిత సమాజ స్థాపనతోనే సుపరిపాలన సాధ్యమని రాయదుర్గం తాలుకా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు బి.బాబు అభిప్రాయపడ్డారు. మండలంలోని డి.కొండాపురం గ్రామంలో సురాజ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయితీ సర్పంచుల పాలన లేకపోవడంతో గ్రామపరిపాలన అధ్వానస్థితికి చేరిందని పేర్కొన్నారు. ప్రజలు జరుగుతున్న అవినీతి, అక్రమాలపై చైతన్యం చెంది సురాజ్య పాలనకు నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు నాగరాజు, తిప్పేస్వామి, అబ్దుల్లా, రాజకుమార్, వన్నూరుస్వామి, దాదు, పాలయ్యలు పాల్గొన్నారు.

**రాయదుర్గం**

# ప్రజా చైతన్యంతోనే సుపరిపాలన

## రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు

## వనపర్తిలో రౌండ్‌టేబుల్

రాజకీయపార్టీలు ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని, దేశం, రాష్ట్రంలో స్వాహాపాలన రాజ్యమేలుతుందని రాష్ట్రప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సురాజ్య ఉద్యమ కమిటీ సభ్యులు కాకి మాధవరావు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలచేతికి అధికారం దక్కాలంటే పాలన వికేంద్రీ కరణ జరగాలని అన్నారు. పట్టణంలోని వివేకానంద ఆడిటోరియం లో సురాజ్య ఉద్యమ కమిటీ, వైబీఐ సంయుక్తంగా ఏర్పాటుచేసిన 'సురాజ్యం' రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. యువతకు మంచి భవిష్యత్ ఇస్తూ చదువుకు తగ్గ నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలు చూపించాలని అన్నారు.

సిటిజన్ చార్ట్‌లో నియమాలను అమలుచేసి హక్కుగా సేవలు పొందేందుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. అందుకే రాష్ట్రంలోని పౌరసమాజం, పాత్రికేయులు, ప్రభుత్వాధికారులు, మేధావులమంతా కలిసి సురాజ్య ఉద్యమ కమిటీ ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. ఎన్నికల వ్యవస్థ ప్రస్తుతం డబ్బు సంచుల చుట్టూ తిరుగుతుందని, ఈ వ్యవస్థను రూపుమాపాలంటే దామాషా పద్ధతిన ఎన్నికలు నిర్వహించాలని లోక్‌సత్తా నాయకులు కె.గీతామూర్తి కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు మురళీధర్, డా॥ బాలక్రిష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ వైద్యులు భూపేష్‌కుమార్, లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు రవీందర్, తెలుగుభాష సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డి, సీపీఎం డివిజన్ కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి మండ్ల రాజు, కేవీపీఎస్ కిరణ్‌కుమార్ టీడీపీ వాకిటి శ్రీధర్ తదితరులు హాజరయ్యారు. వ్యాఖ్యాతగా డీవీవీఎస్ నారాయణ వ్యవహరించగా వైబీఐ నాయకులు రాఘవేందర్, సందీప్, చీర్ల తేజ, రాజ్‌కుమార్, వంశీ పాల్గొన్నారు.

---

# ఉద్యమంతోనే అవినీతి నిర్మూలన

## లోక్‌సత్తా నాయకులు యస్.మనోరమ



## బనగానపల్లిలో రౌండ్‌టేబుల్

అవినీతిపై పోరాటానికి సంకల్పం మాత్రమే సరిపోదని ఉద్యమంతోనే సాధ్యమవు తుందని స్వరాజ్య ఉద్యమ రాష్ట్ర నాయకురాలు మనోరమ అన్నారు. స్థానిక పొదుపు భవనంలో అవినీతి వ్యతిరేక ఉద్యమాలు అన్న అంశంపై పలు పార్టీ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్ మాట్లాడుతూ అవినీతిని అంతం మొందించడానికి యువత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సుచించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మోజెస్, భారత్‌స్వాభిమాన్ నాయకులు రాముడు, లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎన్.జి.శంకర్ పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా సురాజ్య ఉద్యమం

## లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జీ

## రాజమండ్రిలో రౌండ్‌టేబుల్

సురాజ్య ఉద్యమ రౌండ్‌టేబుల్ సమావేశం డాక్టర్ వి.వి.రామారావు అధ్యక్షతన స్థానిక ఎన్.జి.ఓ హోంలో జరిగింది. శ్రీ రాజగోపాల్ స్వాగతం పలికారు. ఉద్యమ లక్ష్యాలపై శ్రీరామచంద్ర మూర్తి పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసారు.

లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు భీశెట్టి బాబ్జీగారు ఉద్యమ నేపధ్యాన్ని, ఆవశ్యకతని వివరించారు. అందరికీ ఎదిగే అవకాశాల కోసం సుపారిపాలన కోసం సురాజ్య ఉద్యమాన్ని రాజకీయాలకు అతీతంగా సాగించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉద్యమ బాధ్యులలో ఒకరిగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ అధ్యక్షులు ఉప్పలపాటి మాచిరాజు మాట్లాడుతూ సుపరిపాలన లక్ష్యంగా, అవినీతి రహిత రాజ్యం సాధిద్దామని కోరారు.
ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలువురు ప్రముఖులు శ్రీరాజేశ్వరరావు, శ్రీరామకృష్ణ, డాక్టర్ చేబ్రోలు శేషగిరిరావు, జే.కాళేశ్వరరావు (సిఏ), కృష్ణంరాజు (లెక్చరర్), ఈదర వీర్రాజు (టీచర్), డాక్టర్ టి.ఎస్.ఆర్. మూర్తి, పసల భీమన్న (రిటైర్డ్ డి ఈ ఓ), సూర్యప్రభ, డాక్టర్ బి.వి.ఎన్.మూర్తి, జి.వి.నారాయణరావు (సీనియర్ సిపిఐ నాయకులు) సీతారం రత్తయ్య డాక్టర్ పాలడుగు చంద్రమౌళి (సీనియర్ లోక్‌సత్తా సభ్యులు) డి.ప్రసాదరెడ్డి, నగేష్ కుమార్, కరుణాకర్ (లోక్‌సత్తాలోని మంచి ప్రసంగికుడు), ఉమాబాబు, భావన రుషి, బొమ్మన రాజకుమార్(వైఎస్ఆర్‌సిపి), తదితర పురపౌరులు పాల్గొన్నారు.

---

# నాడు స్వరాజ్యం జన్మహక్కు - నేడు సురాజ్యం పౌరహక్కు

## లోక్‌సత్తా నాయకులు బండారు రామ్మోహన్‌రావు

## నంద్యాలలో రౌండ్‌టేబుల్

ఓటు వేసేది మనం, పన్నులు కట్టేది మనం అందుకే ప్రజలే ప్రభువులు పాలకులు సేవకులే కావాలని నాడు స్వరాజ్య జన్మహక్కుని చాటితే నేడు సురాజ్యం మన పౌర హక్కుగా నినదించాలని లోక్‌సత్తా సురాజ్య ఉద్యమ రాష్ట్ర నేత బండారు రామ్మోహన్‌రావు అన్నారు. నంద్యాల శోభ హోటల్ ఫంక్షన్‌హాల్‌లో సురాజ్య ఉద్యమ రౌండ్ టేబుల్ సమావేశానికి ఆయన సమన్వయకర్తగా వ్యవహరించారు.
అవినీతి మూలాలు రాజకీయాలలో వున్నాయని, ఓటుకు నోటు, మద్యం ఇచ్చి కోట్లు ఖర్చుపెట్టి ఓట్లుకొనుగోలు చేసే రాజకీయాలవల్లే అవినీతి పెరిగిపోయిందని ఆయన అన్నారు. కర్నూలు పట్టణ సురాజ్య కమిటీ అధ్యక్షులు బి.ఎన్.చెట్టి, లోక్‌సత్తా నాయకులు మజీద్ స్వాగతం పలికారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు స్వచ్ఛంద సంస్థలు, డాక్టర్లు, లాయర్లు, కులసంఘాల నాయకులు సురాజ్య ఉద్యమంపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. టి.డి.పి.నాయకులు మాజీ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్ మాట్లాడుతూ సురాజ్య ఉద్యమ లక్ష్యాల అమలుకు తన వంత కృషి చేస్తానన్నారు. సి.పి.ఎం. పార్టీ నాయకులు మస్తాన్‌వలీ, బి.జె.పి.నాయకులు తూము శివారెడ్డి, వై.యస్.ఆర్ కాంగ్రెస్ నాయకులు రమణయ్య గౌడ్, ప్రభృతులు సురాజ్య ఉద్యమానికి తోడ్పాటును ప్రకటించారు. నంద్యాలలోని కళాశాల యాజమాన్యల నుండి జి.రామకృష్ణారెడ్డి, ఇంతియాజ్, అక్మర్, డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ శౌరెడ్డి, న్యాయవాదులు రామచంద్రరావు, శంకరయ్య, తమ తమ అభిప్రాయాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురాజ్య అధ్యక్షుల రామకృష్ణారెడ్డి, లోక్‌సత్తా నాయకులు టి.ఆర్.జగన్నాధరెడ్డి, ఎం.ఓంకార్, కె.శంకర్ ఎమ్.వి. సత్యనారాయణ, ఎన్.ఎ.హమ్మద్, యువసత్తా ఎస్.పి.దాస్, పి.ఎన్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో రౌండ్‌టేబుల్



# నంద్యాలలో రౌండ్‌టేబుల్



# సుపరిపాలనే సురాజ్య ఉద్యమ ధ్యేయం

## సురాజ్య ఉద్యమ కన్వీనర్ డా॥ జయప్రకాష్ నారాయణ్



## ఖమ్మంలో రౌండ్‌టేబుల్

సుపరిపాలన సాధించటమే సురాజ్య ఉద్యమ ధ్యేయమని లోక్‌సత్తా పార్టీ అధినేత డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఖమ్మంలోని జడ్పీ మీటింగ్ హాల్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదర్శవంతమైన ప్రభుత్వం కోసం ప్రజలను చైతన్య పరిచేందుకు సురాజ్య ఉద్యమం చేపట్టినట్లు చెప్పారు. రాజకీయాలకు అతీతంగా సాగిస్తున్న ఈ ఉద్యమానికి ప్రజల మద్దతు లభిస్తోందన్నారు. అన్ని పార్టీలకు చెందిన నేతలు విద్యార్థి మేధావులు సురాజ్య కమిటీల్లో చేరుతున్నారన్నారు. అవినీతిపరులకు కఠిన శిక్షలతో పాటు వారి అక్రమ సంపాదనను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రజా సేవలకు లంచాలు గుంజుతుండటం వల్ల డబ్బు పెట్టందే ఎటువంటి ప్రయోజనాలు పొందలేని దుస్థితి దాపురించిందన్నారు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా... ఈ తరహా అవినీతి తొలగటం లేదన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు విపరీతంగా ఖర్చు చేస్తుండటం వల్లే గెలిచాక అక్రమంగా సంపాదిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు స్థానిక సంస్థల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ప్రజలకు సకాలంలో సేవలందింపని అధికారుల నుంచి ప్రజలకు రోజుకు వంద రూపాయల పరిహారం ఇప్పించేలా చట్టాలు చేయాలన్నారు.

### ఆదర్శ సమాజం లక్ష్యం కావాలి..

నీతివంతమైన ఆదర్శ సమాజ నిర్మాణం ప్రతీ ఒక్కరి లక్ష్యం కావాలని తెలుగురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లమల వెంకటేశ్వర రావు అన్నారు.

ప్రభుత్వాల అవినీతి తారాస్థాయికి చేరటం వల్ల నేతల అక్రమ సంపాదన లక్షల కోట్లకు చేరిందని సీపీఎం జిల్లా నేత నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. దోపిడి రహిత సమాజ సాధనకు మా వంతు సహకారం అందిస్తామన్నారు.

### యువ చైతన్యం ఎంతో అవసరం...

మెరుగైన సమాజస్థాపనకు యువచైతన్యం ఎంతో అవసరమని ప్రముఖ విద్యావేత్త ఎండీ ఆసద్ అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య, ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొప్పు నరేష్, లోక్‌సత్తా నేతలు రవిమారుత్, జూపల్లి సత్యనారాయణ్ పాల్గొన్నారు.

### చర్చా వేదిక...

సురాజ్య ఉద్యమం.. అవినీతి రహిత సమాజ సాధన అనే అంశాలపై జయప్రకాష్ నారాయణ్ చర్చావేదిక నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలు కళాశాలకు చెందిన యువతీ యువకులు, మేధావులు, పాల్గొని ప్రశ్నలు లేవనెత్తగా జయప్రకాష్ నారాయణ్ వాటికి పరిష్కార సమాధానాలిచ్చారు. రిజర్వేషన్ల అమలుపట్ల అవినీతి వ్యవస్థకు కారణమైన పరిస్థితులు, అక్రమాలకు పాల్పడిన మంత్రులపై ప్రభుత్వ స్పందన తదితర సామాజిక అంశాలపై అడిగిన ప్రశ్నలకు జేపీ సమాధానాలు ఇచ్చారు.

# అందరికీ ఎదిగే అవకాశాల కోసం సురాజ్యం

## శాసనమండలి సభ్యులు డా॥ గేయానంద్



డబ్బుతో నిమిత్తం లేకుండా పిల్లలందరికీ మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలు అందించడం, యువతకు ఉపాధినిచ్చే నైపుణ్యాలు కల్పించి రైతులకు వ్యవసాయాన్ని లాభసాటి చేయడం సురాజ్య ఉద్యమ లక్ష్యాలలో ఎమ్.ఎల్.సి.డాక్టర్ గేయానంద్ అన్నారు. అనంతపురం జిల్లా కదిరిలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. లంచాలు లేని ప్రభుత్వ సేవలకోసం అవినీతి రహిత పాలనకోసం దేశంలో లోక్‌పాల్, రాష్ట్రంలో లోకాయుక్త, జిల్లాల్లో అంబుడ్స్‌మన్ వ్యవస్థలు దామాషా పద్ధతి ఎన్నికల్ని ప్రవేశపెట్టాలన్నారు.

## కదిరిపట్నం లో రౌండ్‌టేబుల్

అవినీతికి చోటు లేని ఉత్తమ సమాజ సాధనే సురాజ్యఉద్యమ లక్ష్యమని లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు బండారు రామ్మోహన్‌రావు తెలిపారు. స్థానిక దాదా ఫంక్షన్ హాలులో స్వరాజ్య ఉద్యమ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు హాజరై అవినీతి మూలాలను సమూలంగా నిర్మూలించి నప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని ప్రసంగించారు.

జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ ఓటు వేసేది మనం, పన్నులు కట్టేది మనం. అందుకే ప్రజలే ప్రభువులు – పాలకులు సేవకులే కావాలని సుపరిపాలన మా పౌరహక్కుగా నినదించాలన్నారు. సురాజ్యం అసాధ్యమైన దేమీ కాదని మన బడ్జెట్‌లో అవినీతిపాలు అవుతున్న సొమ్మును సరిగ్గా సద్వినియోగం చేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు.

సమావేశంలో ఆయా సంఘాల నాయకులు లక్ష్మణ్‌రెడ్డి, ఓంకార్, ఒన్నూరప్ప, మహమ్మద్‌గౌస్, ఆంజనేయులు, రెడ్డెప్ప, ఇంద్రావతమ్మ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరులో రౌండ్‌టేబుల్



# పరిపాలన సక్రమంగా లేదు

## రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు

దేశానికి మూల స్తంభాలైన న్యాయ, శాసన, అధికార వ్యవస్థలు విఫలమవ్వడం దురదృష్టకరమని రాష్ట్ర మాజీ ముఖ్య కార్యదర్శి కాకి మాధవరావు అన్నారు. లోక్‌సత్తా జిల్లా ఉద్యమ సంస్థ ఆధ్వర్యంలో ఎల్ఎండీ కాలనీలోని శ్రీచైతన్య పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'అవినీతిని వ్యతిరేకిద్దాం-దేశాన్ని ప్రేమిద్దాం అనే చైతన్య కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో పరిపాలన సక్రమంగా లేదన్నారు. రాజకీయ అవినీతి, అక్రమాలకు ఎన్నికల పద్ధతే కారణమన్నారు. పార్టీ ఓట్లు కాకుండా మొత్తం ఓట్ల శాతం ఆధారంగా అసెంబ్లీలో ఆయా పార్టీలకు సీట్లు ఇవ్వాలన్నారు. లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి రాజమౌళి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రశ్నించడం నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ బండారి నవీన్ కుమార్ అధ్యక్షత వహించగా కళాశాల చైర్మన్ లక్ష్మారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ జ్ఞానేశ్వర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రావు, లోక్‌సత్తా బాధ్యులు వెంకటపతి పటేల్, రాజిరెడ్డి, లెక్చరర్లు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.




### కరీంనగర్‌లో రౌండ్‌టేబుల్

## హుస్నాబాద్‌లో రౌండ్‌టేబుల్

అవినీతికి వ్యతిరేకంగా చేపట్టిన సురాజ్య ఉద్యమంపై డిసెంబర్ 9వ తేదీ అవినీతి వ్యతిరేక దినం నాటికి కోటి మందికి తమ గొంతు వినిపించాలనే లక్ష్యంగా ఉన్నట్లు మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కాకి మాధవరావు పేర్కొన్నారు. హుస్నాబాద్‌లోని వీఎల్‌రెడ్డి గార్డెన్‌లో లోక్‌సత్తా ఆధ్వర్యంలో సురాజ్య ఉద్యమంపై జరిగిన చర్చాగోష్టిలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో మచ్చలేని నాయకులను ఎన్నుకోవాలని, ధన ప్రాబల్యాలకు గురికాకుండా ఉండాలని, అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఎన్నికల నేరాలను విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు టి.రాజమౌళి మాట్లాడుతూ చట్టాలను వినియోగించుకోవాలని, సమాచారహక్కు చట్టం ద్వారా సాధించిన విజయాల గురించి వివరించారు. కార్యక్రమంలో నోముల శ్రీనివాస్‌రెడ్డి, లెంకల రాజిరెడ్డి, లోక్‌సత్తా జిల్లా ఉపాధ్యక్షుడు పందిల్ల శంకర్, ఎం.మోహన్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు వెంకట్, బీలునాయక్, లింగమూర్తి, శివయ్య విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరుకాగా వివిధ పార్టీల నాయకులు కొత్తపల్లి అశోక్, చిట్టి గోపాల్‌రెడ్డి, తిరుమల, వంగర మల్లేశం, మేకల వీరన్నయాదవ్, రామకృష్ణ, మల్లికార్జునరెడ్డి తదితరులు మాట్లాడారు. మాజీ మంత్రి స్వాతంత్ర్య సమరయోధుడు కొండాలక్ష్మణ్ బాపూజీ మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషం మౌనం పాటించారు.



# సురాజ్యఉద్యమం రౌండ్ టేబుల్

## సురాజ్య ఉద్యమ కన్వీనర్ డా॥ జయప్రకాష్ నారాయణ్



సనత్‌నగర్‌లో రౌండ్‌టేబుల్

ఆనాటి తెల్లదొరలను పారద్రోలడానికి స్వరాజ్యం ఏర్పడగా, దాని ఫలాలు అందరికి సమానంగా అందకపోవడం, వారి స్థానం నల్లదొరలు రాజ్యమేలడం వలన సురాజ్య ఉద్యమానికి శ్రీకారం చూటింది లోక్‌సత్తా. ఇందులో భాగంగా సనత్‌నగర్ నియోజక వర్గంలో నియోజకవర్గ బాధ్యులు హేమ ప్రవీణ్ ఆధ్వర్యంలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు డా॥జయప్రకాష్‌నారాయణ్, అన్ని పార్టీల నాయకులు, కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, స్వచ్ఛందసంస్థల పురప్రముఖులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ఈ సురాజ్య ఉద్యమ కమిటికి సహకరించాలని, కోటి మందిని దీనిలో భాగస్వామ్యం కావాలని మంచి రాజకీయంలో ప్రతి ఒక్కరు మౌనం వీడి రావాలని జేపీగారు సూచించారు. మన నియోజకవర్గంలో ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోవడానికి మన రాజకీయ వ్యవస్థే అని హేమప్రవీన్ అన్నారు దీనిని అందరు కలసి భాగుచేసేందుకు కలిసి కట్టుగా కృషి చేద్దామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్ వెంకటరామ, మాజీ ఎమ్మెల్యే ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించేతత్వం పెంపొందాలి

## రాష్ట్ర ప్రజా ఉద్యమ ఐక్యవేదిక కన్వీనర్ బి. రామకృష్ణరాజు




తాడేపల్లిగూడెంలో రౌండ్‌టేబుల్

సురాజ్య ఉద్యమం ద్వారా ప్రజల్లో ప్రశ్నించే తత్వం పెంపొందాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డులో అవినీతి అంతం, అందరి అభివృద్ధి కోసం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రజా ఉద్యమ ఐక్యవేదిక కన్వీనర్ బి. రామకృష్ణరాజు, ముఖ్య అతిధిగా పాల్గొనగా కెకె విశ్వేశ్వరరావు, జంగాడోపాల్, కర్రి రామచంద్రరావు, ప్రత్తి వీరాస్వామి, కర్రి సీతారామయ్య, పి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల వ్యవస్థలో మార్పు రావాలి

## లోక్‌సత్తా నాయకులు పి. రవిమారుత్



భీమవరంలో రౌండ్‌టేబుల్

ప్రస్తుతం ఉన్న ఎన్నికల వ్యవస్థలో మార్పు రావాలని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి రవి మారుత్ సుచించారు. డీఎన్నార్ కళాశాల లోని డైమండ్ జూబ్లీహాల్‌లో 'సురాజ్య ఉద్యమం' రౌండ్ టేబుల్ జరిగింది. మనం కట్టే పన్నులకు ప్రభుత్వ సేవలు తగిన విధంగా పొందే హక్కు పూర్తిస్థాయిలో అమలుకావాలని పిలుపునిచ్చారు. అవినీతి నిర్మూలనకు కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రంలో లోకాయుక్త జిల్లాలో అంబుడ్స్‌మన్ వ్యవస్థ రావాలన్నారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారించుకొనేల మార్పు రావాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి డీఎన్నార్ ఇంజినిరింగ్ కళాశాల ప్రిన్సిపల్ యు.రంగరాజు అధ్యక్షత వహించారు. జిల్లా లోక్‌సత్తా నాయకులు జి.జానకి రామరాజు, రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి నాయకుడు మంతెన సూర్యనారాయణరాజు, సభ్యుడు మెంటేసోమేశ్వరరావు, డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్యాపకురాలు జ్యోతి మాట్లాడారు. లోక్‌సత్తా స్థానిక నాయకులు అల్లూరి సీతారామరాజు, మంతెన కృష్ణంరాజు, ఎన్.భాస్కరరాజు, కె.రవి శంకర్, ఎంఏఅన్సారీ, ముగ్ధ ఆలీ, మంతెన రామలింగరాజు, ఎంఎస్ఎన్‌మూర్తి, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సమాజమే సురాజ్య ఉద్యమ లక్ష్యం

## లోక్‌సత్తా రాష్ట్ర నాయకురాలు యస్. మనోరమ



బద్వేలులో రౌండ్‌టేబుల్

అవినీతి రహిత సమాజమే సురాజ్య ఉద్యమ లక్ష్యమని లోక్‌సత్తా రాష్ట్ర నాయకురాలు మనోరమ అన్నారు. స్థానిక ఎన్‌జీవో హోంలో జరిగిన సురాజ్య రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అవినీతి రహిత పాలన కోసం సురాజ్యం పనిచేస్తుందన్నారు. అలాగే రైతులకు లాభసాటి వ్యవసాయం, మహిళలకు ప్రత్యేక ఆదాయ మార్గాలు, పిల్లలందరికీ మంచి ప్రమాణాలతో కూడిన విద్య, గ్రామాలకు కనీస సౌకర్యాలువంటి అంశాలపై సురాజ్య ఉద్యమం పనిచేస్తుందని తెలిపారు. సురాజ్య ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కార్యక్రమ సమన్వయకర్త శ్రీకాంత్‌రెడ్డి కోరారు. అనంతరం సురాజ్య ఉద్యమ బద్వేలు పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండపల్లి సుభాష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి గంపా తిరుపతి, బీసీ సంఘం నాయకుడు గురుమూర్తి, శివరామయ్య, సీపీఐ నాయకుడు జకరయ్య, సీపీఎం నాయకుడు వీరశేఖర్, బీజేపీ నాయకుడు వెంకటేశ్వర్లు ప్రసంగించారు.





అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరణ




మహబూబ్‌నగర్‌లో రౌండ్‌టేబుల్



నరసరావుపేటలో సురాజ్య ఉద్యమం



వనపర్తిలో సురాజ్య ఉద్యమం

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12




## ఖమ్మం రౌండ్‌టేబుల్ సమావేశంలో
## డా॥ జయప్రకాష్ నారాయణ్

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad